

# హైదరాబాద్ వార్త


## బస్తీ దవాఖానను సందర్శించిన కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్,మార్చి 1, ప్రభాతవార్త**

బస్తీ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వైద్యాధికారులు సూచించారు. ఆదివారం ఉదయం 9గంటలకు బిజేఆర్‌నగర్ బస్తీ దవాఖానను ఆకస్మికంగా సందర్శించి, కేంద్రంలో సమయపాలన, సమగ్ర కార్యకలాపాల నిర్వహణ తీరును పరిశీలించారు. తదుపరి కలెక్టర్ మెడికల్ చెకప్ చేయించుకుని జ్వరం ,జలుబు ఉండడంతో వైద్యాధికారి ఈ సందర్భంగా మెడిసిన్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు రావడంతో జిల్లాలో ఉన్న అన్ని బస్తీ దవాఖానలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించటంతో పాటు వారికి వైద్యం పట్ల విశ్వాసం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా వైద్యాధికారులు సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. అలాగే కేంద్రం లోని అన్ని రిజిస్టర్లను సమగ్రంగా పరిశీలించి, అందిస్తున్న సేవలు, ఓపీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం వచ్చిన రోగులతో సంభాషించి అందుతున్న సేవలను



బిజేఆర్‌నగర్ బస్తీ దవాఖానను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ హరిచందన దాసరి

అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ పరీక్షల కోసం పంపబడుతున్న నమూనాలు, మెడికల్ స్టోర్‌లో ఔషధ నిల్వలను పరిశీలించారు. దవాఖాన ప్రాంగణం ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వర్ష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# బోరు నీరు..బేజారు!

**-కంగారెత్తిస్తున్న కఠిన జలాలు -ఇదే నీటిని వినియోగిస్తున్న ప్రజలు**

**-స్నానాలు, ఇతర అవసరాలకు వాడకం -ఊడిపోతున్న జుట్టు, మారుతున్న చర్మం రంగు**

**హైదరాబాద్, మార్చి 1 ప్రభాతవార్త**

మహానగరానికి దూరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతంగా జీవించేందుకు కోట్లాది రూపాలు వెచ్చించి గేటెడ్ కమ్యూనిటీల్లో విశాలమైన స్థలం, అద్భుతమైన సౌకర్యాలు, అత్యాధునిక వసతులుగల విల్లాలు, ఫ్లాట్లు కొన్నామన్న సంతృప్తి కన్నా.. గుక్కెడు తాగునీరు కాదు కదా..స్నానాలకు వినియోగించే నీరు కూడా సురక్షితం లేకుండా పోతోంది. నీటి బాధలతో నివాసితులను నిత్యం వెంటాడుతూ ఉన్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొందరు సురక్షితం కాని కఠిన బోరు నీటిని, మరికొందరు ఉప్పు హెచ్చుతగ్గులతో సరిగా శుద్ధి చేయని నీటిని స్నానాలకు వినియోగిస్తుండటంతో చర్మం, తల వెంట్రుకలపై దుష్ప్రభావం చూపుతున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. చర్మం రంగు మారడం, దురదతో పాటు తల వెంట్రుకలు పలుచబడిపోతున్నట్లు తేలింది. ఆ నీటిని తాగితే మాత్రం శరీరంలోని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపి అనారోగ్యం బారిన పడటం తథ్యమని రుజువవుతోంది.

### సురక్షిత జలాలు కరువు...

ఔటర్ రింగ్ రోడ్ లోపల, అవతల ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, భారీ అపార్టుమెంట్లు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నాయి. అందులో 60 శాతం సముదాయాలు సురక్షిత నీరు లేక తల్లడిల్లుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్ మంచినీటి పథకం ఫేజ్-1, ఫేజ్-2 పరిధిలోని రిజర్వాయర్ నీటి సామర్థ్యం బట్టి ప్రధాన పైపులైన్‌కు అందుబాటులో ఉన్న సముదాయాలకు జలమండలి ద్వారా సురక్షిత నీరు సరఫరా అవుతున్నా..మరికొన్నింటికి ఫిజిబిలిటీ లేక మంచి నీరు అందని ద్రాక్షగా మారింది. అందులో కొన్ని గేటెడ్ కమ్యూనిటీలకు,కాలనీలకు ఫిజిబిలిటీ ఉన్నా..నల్లా కనెక్షన్ కోసం ప్రధాన పైప్‌లైన్ నుంచి బహుళ సముదాయాల వరకు మరో పైప్ లైన్ ఏర్పాటుకు డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.శివారులో సుమారు 10వేలకు పైగా గేటెడ్ కమ్యూనిటీలు, భారీ బహుళ అంతస్తుల భవన సముదాయాలున్నాయి. అందులో కేవలం 4,790 సముదాయాలకు మాత్రమే జలమండలి నీటిని సరఫరా చేస్తోంది. అందులో 4,493 ఎంఎస్‌బీ (మల్టీస్టోరేజ్ బిల్డింగ్) కేటగిరి, 300 బల్క్ కనెక్షన్లు ఉన్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరికొన్ని కమ్యూనిటీలు నల్లా కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా రిజర్వాయర్ నీటి సామర్థ్యం, అవసరమైన సాధ్యాసాధ్యాలను బట్టి జలమండలి కనెక్షన్లు మంజూరు చేస్తోంది.శివారు ప్రాంతంలోనే కాకుండా బోడుప్పల్, ఫిర్జాదిగూడ, రామంతాపూర్ తదితర కొన్ని ప్రాంతాల్లో నీటి కనెక్షన్లు ఉన్నా..లోప్రెషర్‌తో రక్షిత మంచినీరు సరిపడక ఎక్కువ శాతం బోరు నీటిపైనే ఆదారపడడం గమనార్హం.

### శిరోజాలకు పోషకాలు అందక..

సాధారణంగా బోరు నీటిలో లవణాలు ఎక్కువ ఉండి కఠినత్వంగా ఉంటాయి. బోరు నీటితో తల స్నానం చేస్తే జుట్టు ఊడిపోవడానికి, జుట్టు పలుచబడడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. బోరు నీటిలో ఉండే కాల్షియం, మెగ్నీషియం లాంటి ఖనిజాలు తలపై పలుచని గట్టిపొరను ఏర్పరుస్తాయి. దీని వల్ల జుట్టు కుదుళ్ల గట్టిపడి జుట్టుకి తేమ, సహజ తైలం అందక, సరిగా రక్త ప్రసరణ జరగక జుట్టు బిరుసెక్కి, గట్టిపడి సహజ మెరుపును కోల్పోతుంది. పోషకాలు అందక జుట్టు చివర చిట్లిపోయి ఊడిపోతుంది. బోరు నీటిలో ఉండే ఖనిజాలు జుట్టుకు హానికరం, తల స్నానం చేసినప్పుడు సబ్బు సరిగా కరగకపోవచ్చు. దీంతో జుట్టులో మలినాలు మిగిలిపోయే ప్రమాదం ఉంది.

### బోరు వాటర్‌తోనే నిత్యావసరాలు...

నగరంలో చాలా చోట్ల నిత్యావసరాలకు బోరు వాటర్ వినియోగిస్తుంటారు. దాదాపు బోరు నుంచి ఉప్పు నీరు వస్తుంటుంది. అనివార్యంగా ఆ నీటితోనే ఫిల్టర్లతో తాగడానికి అలాగే స్నానం చేయక తప్పదు. బోరు వాటర్‌కు ఫిల్టర్లు కనెక్షన్లు పెట్టుకున్నా అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. అలాగే ఉప్పు నీళ్లతో తలస్నానం చేస్తే జుట్టు తెల్లబడిపోతుందా..జుట్టు దెబ్బ తింటుందా..అనే అనుమానం చాలా మందిలో వస్తుంటాయి. వాస్తవకంగా వెంట్రుకల కుదుళ్లలో ఉండే మెలనోసైట్లు మన జుట్టుకు రంగును ఇస్తాయి. అయితే..వయసు పెరిగే కొద్దీ మెలనోసైట్ల సంఖ్య తగ్గడంతో జుట్టు తన సహజ రంగును కోల్పోతుంది. కాని చిన్న వయసులోనే జుట్టు తెల్లబడటానికి చాలా కారణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఉప్పు నీటితో ప్రతిరోజు దుస్తులు శుభ్రపరిస్తే అవి త్వరగా పాడైపోయే అవకాశాలు లేకపోలేదని వస్త్రవ్యాపారులు పేర్కొంటున్నారు. అలాగే కూరగాయలు, పండ్లు మంచినీటితో శుభ్రపరుచుకుంటే ఎంతో మేలని సూచిస్తున్నారు.



### చర్మ వ్యాధులు సంక్రమిస్తున్నాయి...

బోరు నీరు తాగడానికే కాదు..స్నానానికి కూడా పనికి రావు. శుద్ధి అవసరం, ఈ నీటిలో కాల్షియం, మెగ్నీషియం, ఫ్లోరైడ్ సాంద్రత అధికం, ఈ కఠిన జలం చర్మం, తలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. స్నానం చేయడం వల్ల క్రమేణా తలపై పలుచని గట్టి పొర ఏర్పడి రంధ్రాలు మూసుకుపోతాయి. ముఖ్యంగా చిన్న పిల్లలకు బోరు నీటితో స్నానం చేయించరాదు. చర్మ వ్యాధులు సంక్రమించే అవకాశముంది.

**-డాక్టర్ ఎం.రంగయ్య**
**చిల్డ్రన్ వైద్యుడు,విద్యానగర్**

### చర్మం పొడిబారుతోంది..

బోరు నీటిని వినియోగిస్తున్నాం. ఆ నీటితో స్నానం చేస్తే చర్మం ఎర్రబడి పొడిబారిపోతోంది. దురద వేస్తోంది. వాషింగ్ మిషిన్‌లు పాడవుతున్నాయి. బట్టల మురికి పోవడం లేదు.జుట్టు ఊడిపోవడం, జాయింట్ నొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. ప్రభుత్వానికి పన్ను చేస్తున్నా..రక్షిత మంచినీటి కనెక్షన్ ఉన్నా మూడు రోజులకు ఒకసారి వచ్చే నీరు తాగడానికి కూడా సరిపోవడం లేదు.

**పి.సంధ్య**
**కేశవ్‌నగర్, బోడుప్పల్**

## గచ్చిబౌలిలో మద్యం మత్తులో రెచ్చిపోయిన బెంజ్ కారు డ్రైవర్

**-విప్రో చౌరస్తా వద్ద వాహనాలను ఢీకొట్టి పరారీ**

**-కారు ఆపేందుకు యత్నించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ మీదకు దూకించిన మందుబాబు**

**-కారు బ్యానెట్ మీద కానిస్టేబుల్ ఉన్నా కిలోమీటరు దూరం పరుగులు**



కారు బ్యానెట్ మీద కానిస్టేబుల్ ఉండగా, పరుగులు తీస్తున్న కారు దృశ్యాలు



నిందితుడు గుర్రంపాటి తరుణ్

**గచ్చిబౌలి, మార్చి 1 ప్రభాతవార్త :** పట్టపగలే ఐటి కారిడార్‌లో ఓ మందుబాబు తన ఖరీదైన బెంజ్ కారుతో రెచ్చిపోయి వీరంగం సృష్టించాడు. మొదట విప్రో సర్కిల్ వద్ద ఓ కారు, ద్విచక్రవాహనాన్ని కారుతో ఢీకొట్టిన మందుబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. ట్రిపుల్‌ఐటీ చౌరస్తా వద్ద కారును గమనించి అడ్డుకునేందుకు ప్రయత్నించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ మీదకు కారును దూకించాడు. కానిస్టేబుల్ కారు మీద ఎగిరిపడి బ్యానెట్ పట్టుకోగా, మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కిలోమీటరు దూరం కారును ఆపకుండా పరుగులు పెట్టించాడు. తోటి వాహనదారులు కారును అడ్డుకొని కానిస్టేబుల్‌ను రక్షించడంతో పాటు నిందితుడిని పోలీసులకు అప్పగించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...నార్సింగిలోని జయభేరి ది సమ్మిట్‌లో నివాసం ఉండే ఓ డాక్టర్ కుమారుడు గుర్రంపాటి తరుణ్(24) యుఎస్‌లో చదువుకొని నగరానికి వచ్చి ఖాళీగా ఉంటున్నాడు. ఇతను శనివారం మధ్యాహ్నం సమయంలో మద్యం సేవించి, మత్తులో తన కారు (టిఎస్07 ఈఎక్స్ 5556)లో రోడ్డు మీదకు వచ్చాడు. మొదట గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని విప్రో చౌరస్తా వద్ద వేగంగా ప్రయాణిస్తూ రాహుల్ కామరాజు అనే వ్యక్తి కారు(టిఎస్07 జెఎం 6696)ను, పక్కనే ఉన్న ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. అక్కడ స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నించగా, కారుతో సహా ఔటర్ రింగురోడ్డు వైపు పరారయ్యాడు. అక్కడే ఉన్న ట్రాఫిక్ సిబ్బంది కారు వివరాలను చుట్టు ప్రక్కల ఉన్న పోలీసులకు సమాచారం అందజేశారు. కాగా మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటి చౌరస్తా వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ నర్సింహులు మందుబాబు తరుణ్ కారును గమనించి అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో నర్సింహులు మీదకు కారును దూకించడంతో ఎగిరి కారు మీద పడిన కానిస్టేబుల్ బ్యానెట్‌ను పట్టుకున్నాడు. కానీ కారును ఆపకుండా తరుణ్ పరుగులు పెట్టించాడు. వాహనాల రద్దీ మధ్య కారు బ్యానెట్ మీద కానిస్టేబుల్ రక్షించాలంటూ అరుస్తున్నా లెక్కచేయకుండా కిలోమీటరు దూరం వెళ్లాడు. చివరికి గోపిచంద్ స్టేడియం వద్ద తోటి వాహనదారులు కారు బ్యానెట్ మీద ఉన్న కానిస్టేబుల్‌ను గమనించి కారును అడ్డుకున్నారు. నిందితుడు తరుణ్‌ను పోలీసులకు అప్పగించగా, తరుణ్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తే 160ఎంజీ వచ్చింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసిన గచ్చిబౌలి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కానిస్టేబుల్ నర్సింహులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. తరుణ్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



**హైటెక్ సిటీ వద్ద నిర్వహించిన వింటేజ్ క్లాసిక్ కార్ ర్యాలీ షో పాల్గొన్న కార్లు**

## అక్కడ బాంబులు..ఇక్కడ బెంబేలు

**-ఇరాన్-అమెరికా,ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం**

**-బంధువుల్లో ఆందోళనకర పరిస్థితులు**

**-గల్ఫ్ దేశాల్లో అత్యధిక సంఖ్యలో నగరవాసులు**

**హైదరాబాద్ మార్చి 1 ప్రభాతవార్త**

ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం నగర ప్రజల్లో ఆందోళన నెలకొంది.అక్కడ జరుగుతున్న యుద్ధం..ఇక్కడివారిలో గుబులు పుట్టిస్తోంది. అక్కడ చిక్కుకున్న వారి కుటుంబసభ్యులు, బంధువుల్లో తీవ్ర ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. యూఏఈ, జోర్డాన్, బహ్రెయిన్, దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, అబుదాబి, ఇజ్రాయెల్ దేశాల్లో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉన్నప్పటికీ వారి కుటుంబాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.ఇరాన్‌తో పాటు గల్ఫ్ దేశాల్లో అత్యధిక సంఖ్యలో నగరవాసులు ఉన్నారు. ఇప్పుడు వీరంతా తీవ్రంగా కలత చెందుతున్నారు. తమ బంధువులు, సన్నిహితులు ఎలా ఉన్నారో అంటూ బెంగ పెట్టుకున్నారు. వారి యోగక్షేమాల గురించి ఎప్పటికప్పుడు సమచారం ఆరా తీస్తున్నారు. పాతబస్తీ, టోలీచౌకి, సైబరాబాద్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులు, ఇంజినీర్లతో పాటు వ్యాపారులు తరచూ ఇరాన్‌కు రాకపోకలు కొనసాగిస్తున్నారు. వీరి క్షేమ సమాచారలు తెలియలేదు. ఇరాన్ ప్రభుత్వం ఇంటర్నెట్ సౌకర్యాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో తమ పిల్లల ఫోన్లు కూడా పనిచేయడం లేదని పాతబస్తీలో ఉంటున్న ఓ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నత చదువుల కోసం వెళ్లిన విద్యార్థులు,ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వందలాది మంది గల్ఫ్ దేశాల్లో వందలాది మంది జీవనం కొనసాగిస్తున్నారు. కొందరు భవన నిర్మాణ కార్మికులుగా, మరికొందరు తోట పనులు, ఇంకొందరు కారు డ్రైవర్లుగా ఇలా వివిధ రంగాల్లో పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. గల్ఫ్ దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో అక్కడ ఉపాధి పొందుతున్న వారి బాధిత కుటుంబసభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉంది. తమ వారు ఎలా ఉన్నారో



అంటూ పదే పదే వారికి వాట్సప్ కాల్ చేస్తూ యోగక్షేమాలు అడిగి అక్కడి పరిస్థితిని తెలుసుకుంటున్నారు. అందరూ క్షేమంగా ఉన్నామని చెబుతుండటంతో వారు ఊపిరి తీసుకుంటున్నారు.

వివిధ పనుల మీద విదేశాల్లో ఉన్నవారంతా ఇప్పుడు బంకర్లలో తలదాచుకుంటూ, స్వదేశానికి చేరే మార్గం కోసం ఎదురుచూస్తున్నారు. "మా అబ్బాయి అక్కడ చిక్కుకున్నాడు, ప్రతి క్షణం భయంగానే ఉంది" అంటూ నగరంలోని పలువురు తల్లిదండ్రులు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు.ప్రస్తుతం భారత విదేశాంగ శాఖ రాయబార కార్యాలయాల ద్వారా అక్కడి వారందరినీ సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. మంచు విష్ణు, ఇతర తెలుగు వారందరూ క్షేమంగా నగరం చేరుకోవాలని సినీ ప్రముఖులు, అభిమానులు ప్రార్థిస్తున్నారు. కాగా గగనతలం మూసివేయడంతో, రోడ్డు మార్గంలో పొరుగు దేశాలకు చేరుకుని అక్కడి నుండి భారత్ రావాలనే ఆలోచనలో కొందరు ఉన్నప్పటికీ.. భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ప్రస్తుతానికి ఎక్కడి వారు అక్కడే ఉండాలని, సురక్షితంగా స్వదేశానికి తీసుకువస్తామంటూ పేర్కొంటున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు

**-రాజేంద్రనగర్,గండిపేట్ కార్యాలయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే**



**అత్తాపూర్ మార్చి 1, ప్రభాతవార్త :** ప్రజలకు పారదర్శకంగా రిజిస్ట్రేషన్ సేవలను అందించేందుకు ప్రభుత్వ భవనాలలోకి కార్యాలయాలను మార్చడం జరిగిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ అద్దె భవనాల్లో కాకుండా, ప్రభుత్వానికి చెందిన సొంత భవనాల్లోనే నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్, గండిపేట రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాజేంద్రనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం మహిళా సమ్మెక్య భవనంలోకి గండిపేట రిజిస్ట్రేషన్ కార్యాలయం హిమాయత్ సాగర్ లోని పాత మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో ప్రారంభించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ ధనాన్ని ఆదా చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అద్దె భవనాల్లో ఇరుకుగా ఉన్న కార్యాలయాలను విశాలమైన ప్రభుత్వ భవనాల్లోకి మార్చడం ద్వారా ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయని అన్ని వసతులతో కూడిన ఈ భవనాలు ప్రజలకు మరింత చేరువగా ఉంటాయని భారీగా చెల్లిస్తున్న అద్దెల భారాన్ని తగ్గించడం. కార్యాలయానికి వచ్చే ప్రజలకు వెయిటింగ్ హాల్స్, పార్కింగ్ వంటి మెరుగైన సౌకర్యాలు కల్పించడం. ప్రభుత్వ ప్రాంగణాల్లోనే పరిపాలన సాగించడం వల్ల జవాబుదారీతనం పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు వేముల రామకృష్ణ, వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల శ్రీనివాస్, మంగళవారం శ్రీనివాస్ .డాక్యుమెంట్ రైటర్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహ గౌడ్,ప్రధాన కార్యదర్శి జుబేర్, సాయి అమరేందర్ రమేష్ .కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంద్రపాల్ రెడ్డి, పల్ల చెరువు మహేష్, లలిత్, శ్రావణ్ , పాల్గొన్నారు

## మాదకద్రవ్యాల నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.

**జూబ్లీహిల్స్, మార్చి 1, ప్రభాతవార్తః**

వింగ్స్ ఆఫ్ ఫైర్ సంస్థ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన, మనుషుల అక్రమ రవాణాపై నిర్వహించే చైతన్య సదస్సులకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వింగ్స్ ఆఫ్ ఫైర్ సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ మహమ్మద్ యాకుబ్‌పాషా మాట్లాడుతూ.. సమాజంలో మాదకద్రవ్యాల సమస్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. అలాగే మనుషుల అక్రమ రవాణా సైతం పెరుగుతున్నట్లు ఘనాంకాలు చెబుతున్నాయన్నారు. ఈ రెండు ప్రధాన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రమేష్, సతీష్, శ్వేత, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### 506 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

**హైదరాబాద్,మార్చి 1 ప్రభాతవార్త :** నగరంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు రెండు రోజుల పాటు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మొత్తం 506 మంది వాహనదారులు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో 401 ద్విచక్ర వాహనదారులు,47ఆటోలు, 58 ఇతర వాహనదారులు ఉన్నాయి. తనిఖీల్లో వెల్లడైన మద్యం స్థాయిల ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి.జోయెల్ డేవిస్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. రహదారి భద్రత విషయంలో ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

## చిక్కడపల్లిలో అగ్నిప్రమాదం.. తప్పిన ప్రాణాపాయం

**-బాధితులకు వినయ్ కుమార్ పరామర్శ**

**గాంధీనగర్, మార్చి 1 (ప్రభాతవార్త ) :**

గాంధీనగర్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి బాపునగర్‌లో ఆదివారం ఒక నివాస గృహంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఇంట్లోని రిఫ్రిజిరేటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గదిలోని ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ తక్షణమే స్పందించారు. ప్రమాదం జరిగిన వెంటనే వినయ్ కుమార్ డీఆర్ఎఫ్ , అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం వినయ్ కుమార్ ప్రమాదం జరిగిన ఇంటిని సందర్శించి, బాధితురాలు రమాదేవిని పరామర్శించి ధైర్యం చెప్పారు. స్థానిక యువకులతో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "అదృష్ట వశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు, కేవలం స్వల్ప ఆస్తినష్టం మాత్రమే సంభవించింది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, యువమోర్చా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, స్థానికులు శ్రీనివాస్, దయానంద్, హరి, నర్సింగ్, కరుణ తదితరులు పాల్గొన్నారు.



చిక్కడపల్లి లో అగ్నిప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్

## నిజాంపేట్ సర్కిల్‌లో రోడ్ల మరమ్మతులు తక్షణమే చేయాలి : ఆకుల సతీష్



నిరసన తెలుపుతున్న ఆకుల సతీష్ టీం

**నిజాంపేట్, మార్చి 1, ప్రభాతవార్త**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారుల దుస్థితిపై ఆదివారం ఆకుల సతీష్ టీం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నిజాంపేట్ నుండి బాచుపల్లి, బాచుపల్లి నుండి ప్రగతినగర్, ప్రగతి నగర్ నుండి జేఎన్టీయూ వరకు ఉన్న మెయిన్ రోడ్లలో దాదాపు 50 నుండి 100 ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పడి ఉద్యోగస్తులు, వ్యాపారులు మరియు స్థానిక ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిజాంపేట్ భవ్యసానంద్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. వందల కోట్లు ఖర్చు చేసినప్పటికీ కనీసం ప్రధాన రహదారులను సైతం మరమ్మతు చేయకపోవడం డిప్యూటీ కమిషనర్ నిరక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తక్షణమే నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రోడ్ల గుంతలను పూడ్చి, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మౌలిక వసతుల కల్పనలో విఫలమైన నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్‌ను తక్షణమే బదిలీ చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించే అధికారిని నియమించాలని కోరారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిజాంపేట్ సర్కిల్‌ను కలిపినప్పటికీ పారిశుద్ధం, డ్రైనేజ్ సమస్యలు, గుర్రం డెక్క, మురికి నీరు, దోమల విస్తృతి, గుంతల రోడ్లు వంటి అనేక ప్రజా సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్, వినయ్, సువాసిని శక్తి, ప్రసాద్, శశి, హనుమయ్య, మురళి, పాండు, సతీష్, ఎల్ల స్వామి, శ్రీనివాస్, రాము, గోవర్ధన్, సరోజ, సముద్ర వాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలి: అలీ భాయ్



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మదర్ ల్యాండ్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ అలీ భాయ్

**చిక్కడపల్లి మార్చి 1 ప్రభాతవార్త :** సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని మదర్ ల్యాండ్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ అలీ భాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అలీ భాయ్ మాట్లాడుతూ.. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రోత్సాహంతో తమ అసోసియేషన్ తరపున నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అనాథలకు అన్నదానంతో పాటు ఇతర సహాయక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలీ భాయ్ కుమార్తె శశిధ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ శీను, ఎడ్ల మల్లేష్, అబ్దుల్ నవాజ్, వెంకటేష్, శ్రీను, సత్తి, సంతు, శ్రీమాన్, ఎస్. శేఖర్, కె. విశాల్, వేణు, అబ్దుల్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## రచయిత డాక్టర్ ధర్మారావుకు సన్మానం

**చిక్కడపల్లి మార్చి 1,ప్రభాతవార్త :** అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గాన మాధుర్యాన్ని, సినీ సంగీత వైభవాన్ని భావితరాలకు అందిస్తున్న గొప్ప వ్యక్తి ప్రముఖ పరిశోధకులు, ఘంటసాల తెలుగు సినీ గాన వైభవం గ్రంథ రచయిత సంస్కృతిరత్న డాక్టర్ కె .ధర్మారావుకే దక్కుతుందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి లోని ఫాస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ధర్మారావు వివరాలు వెల్లడించారు. ఘంటసాల గాన విశిష్టతను విశ్లేషిస్తూ తాను రాసిన గ్రంథాన్ని అభిమానులు ఇంతగా ఆదరించడం, ముఖ్యంగా కొండయ్య వంటి వీరాభిమానుల సమక్షంలో సన్మానం జరగడం తనకు ఎంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. ఘంటసాల అభిమానిగా, ఘంటసాల విగ్రహ స్థాపనలో కీలక పాత్ర పోషించిన గుంటూరు పట్టణ లాడ్జీ యజమానుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పొన్నగంటి కొండయ్య. సామాజిక సేవా ప్రముఖుడు చిరుతనగండల ఆంజనేయులు ఆధ్వర్యంలో తనకు జరిగిన సన్మానం జీవితంలో మరిచిపోలేనిదన్నారు. ఫాస్ , ఇట్మా ఫిలిం సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ధర్మారావు మరిన్ని సత్కారాలు, సన్మానాలు పొందాలని ఆకాంక్షి ంచారు.

## ఆల్విన్ కాలనీ డివిజన్‌లో బస్తీబాట



కాలనీలో పర్యటిస్తున్న సతీష్‌రావు

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 1, ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి ఇంచార్జ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు ఆదేశాల మేరకు ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆల్విన్ ఫేస్ 1, వాంబే కాలనీలో స్థానిక ప్రజలతో మమేకమవుతు వారి కాలనీలలో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ రావు మాట్లాడుతూ ఈ వాంబే కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ వెవస్థ సరిగ్గా లేదని డ్రైనేజీ నీళ్లు మంజీరా నీళ్లు రోడ్ల మీద పొంగి పొర్లుతుండడంతో ప్రజలు విష జ్వరాలతో అనారోగ్యాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యలని పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామనీ లేనిపక్షంలో తామే స్వయంగా ప్రజలతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందు ధర్నాకి కూర్చుంటాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనిల్ రెడ్డి, కార్యకర్తలు, కాలనీ వాసులు, టీంఈఎస్ఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ బిఆర్ఎస్ నాయకులు మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం ఇచ్చిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి కెటిఆర్ పాల్గొన్ని సలీమ్‌కు ఖజ్జూరావు తినిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్, గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మునుకుంట్ల ఆనంద్ కుమార్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం



భాగ్యనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు

**యూసుఫ్‌గూడ, మార్చి 1, ప్రభాతవార్త :**

ప్రతి ఆరు నెలలకొసారి జరిగే సర్వసభ్య సమావేశాన్ని శ్రీ వివేకానంద్‌నగర్ కాలనీ ఆనుకుని ఉన్న భాగ్యనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించగా అతనితో పాటు సొసైటీ మాజీ అధ్యక్షులు కుమార్ రెడ్డి, సహచరులు చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రాజు, రవిబాబు ఇతర సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అదేవిధంగా సొసైటీలోని ప్రతి ప్లాట్ ఓనర్ సుమారుగా మూడు వందల నుంచి నాలుగు వందల మంది హాజరయ్యారు. సుమారు 282 ఎకరాల విస్తీర్ణంలో 1425 మంది ప్లాట్ ఓనర్స్ ఉన్నారు. 1990వ సంవత్సరం నుంచి ప్లాట్ ఓనర్లకు మరికొందరికి మధ్య వివాదాలు ఉండటంతో వారి స్థలాలను కాపాడు కోవటంలో ఇబ్బందులు పడ్డారు. 2017లో సొసైటీ ఎన్నికలు నిర్వహించగా అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే బాడీ కొనసాగింది. 2025 తర్వాత ప్రభుత్వ అధికారిని సీఏసీగా నిర్వహించి బాధ్యతలు చేపట్టించినారు. ఇప్పుడు ఎన్నికలు జరిగే అవకాశం వచ్చింది కాబట్టి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయితే కొందరు ప్రస్తుతం ఉన్న ల్యాండ్ మాఫియాలు తమ స్థలాలను ఆక్రమించి నకిలీ దస్తావేజులు సృష్టించి భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే న్యాయపరంగా తాము పోరాటం చేయటం వలన తమకు స్థానికంగా అందరి సహకారం లభిస్తూ వస్తుందని ముఖ్యంగా స్థానిక శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు కూడా పూర్తిగా మద్దతుగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని ప్రజలను ఆదుకునే దిశగా ఆలోచించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరడం జరిగింది. తాము ఇక్కడ ప్లాట్లు కొని సుమారు 30 ఏళ్లు దాటిందని తమ సొంత ఇంటి కళ నెరవేరేలా ఇల్లు నిర్మించుకునేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమారెడ్డి, దశరథరామిరెడ్డి, రవిబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, శ్రీనివాస్ గుప్తా, నందగోపాల్, బిఎస్ఎన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం



కరుణాకర్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉద్యమకారులు చిత్రంలో చంద్రకుమార్, వెంకన్న తదితరులు

**సైఫాబాద్, మార్చి 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉద్యమించిన ఉద్యమకారులకు అనుకూలంగా రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇవ్వడం చారిత్రాత్మకమైన నిర్ణయమని పలువురు వక్తలు చెప్పారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుడు వెంకన్న అధ్యక్షతన ఉద్యమకారుల సమ్మేళనం జరిగింది. ఉద్యమకారుల తరపున హైకోర్టులో కేసును బలంగా వాదించిన కరుణాకర్‌రెడ్డి దంపతులను ఈ సమ్మేళనంలో వక్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ ఉద్యమకారుల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయ వ్యవస్థలో చారిత్రాత్మకమైనదన్నారు. తెలంగాణ ఉద్యమం సువర్ణ అక్షరాలతో లిఖించదగినదన ఉద్యమం అన్నారు. ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు జరిగేంతవరకు న్యాయపరంగా, ప్రజాస్వామ్య పద్దతిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, హైకోర్టు ఆదేశాల ప్రకారం తీర్పు అమలు చేసేంతవరకు ఉద్యమకారులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యమకారులు గోల్లపల్లి నాగరాజు, అంబు రాథోడ్, గుండా యాదగిరి, దేశమల్ల యాదగిరి, జానికిరెడ్డి, సుల్తాన్ యాదగిరి, పి.నాగరాజు, గోపాల్, తిరుపతయ్య, దేవరాణి, శ్రీనివాస్, అనంతుల మధు తదితరులు మాట్లాడుతూ 9 మంది తెలంగాణ ఉద్యమకారులు హైకోర్టును అశ్రయించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్, గుర్తింపు ఇస్తామని ప్రకటించి ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందన్నారు. ఆదే విధంగా ప్రభుత్వం హామీలను, హైకోర్టు తీర్పును అమలు చేయాలని వారు కోరారు.

## సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు : మర్రి రాజశేఖర్ రెడ్డి



ఎమ్మెల్యే మర్రి శేఖర్ రెడ్డికి వివరిస్తున్న కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు

**నేరేడ్ మెట్, మార్చి 1,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిను బోయినపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పలువురు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు కలిసి తమ ప్రాంతాల సమస్యలను వినతి పత్రాల ద్వారా వివరించారు. మచ్చబొల్లారం డివిజన్‌లో ఏడు కాలనీల డ్రైనేజీ ట్రంక్ మెయిన్ సమస్య, మోలాలి వినాయకనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, ఈస్ట్ ఆనంద్‌బాగ్ సత్య రాఘవేంద్ర కాలనీ లంబాడి బస్తీలో వీధి దీపాలు ఏర్పాటు, అడ్డుగా ఉన్న స్తంభాల తొలగింపు వంటి అంశాలను ప్రతినిధులు ప్రస్తావించారు. తాళ్ల బస్తీ–మల్కాజ్‌గిరి మార్గంలో రైల్వే ఆర్‌యూబీ వద్ద సీసీ రోడ్డు, విద్యుత్ దీపాల ఏర్పాటు కోరారు. వెంకటాపురం డివిజన్ కామాజిగూడలో సింగిల్‌ఫేజ్ నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, వంగిపోయిన స్తంభాల పునర్నిర్మాణం, ఖానాజిగూడలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు, సీసీ రోడ్డు నిర్మాణం, స్మశానవాటికలో మౌలిక వసతుల కల్పనపై విజ్ఞప్తి చేశారు. నేరేడ్మెట్ ఓల్డ్ పీఎస్ఎస్ఆర్‌డీజీ పాఠశాల పరిసరాల్లో యువత అసాంఘిక కార్యకలాపాలపై క్రమం తప్పకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. సమస్యలను ఓర్పుతో విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బసవతారంకలో గ్యాస్ట్రిక్ క్యాన్సర్ల పై ప్రత్యక్ష కార్యశాల



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

**జూబ్లీహిల్స్, మార్చి 1, ప్రభాతవార్తః**

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, పరిశోధన సంస్థ(బీఐఏసీహెచ్ అండ్ ఆర్ఐ)లో గ్యాస్ట్రిక్ క్యాన్సర్ల చికిత్సపై ప్రత్యేక సర్జికల్ కార్యశాల నిర్వహించారు. రెండు రోజులపాటూ నిర్వహించిన కార్యశాలలో ప్రధానంగా గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌కు సంబంధించిన పలు అంశాలపై ప్రత్యక్షంగా ప్రదర్శించడంతోపాటూ చికిత్సకై అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పద్దతులను వివరించారు. ఈ కార్యశాలలో తొలి రోజు గాస్ట్రిక్ సర్జరీకి సంబంధించి ప్రత్యక్ష, లాప్రోస్కోపిక్, ఆధునిక రోబోటిక్ సర్జరీ విధానాల పట్ల అవగాహన కలిపించడంతోపాటు ఆయా పద్దతులను ఏ పరిస్థితులలో వినియోగించవచ్చేనే విషయంపై వివరించారు. రెండో రోజైన ఆదివారం చికిత్స అందించేటపుడు ఎదురయ్యే ఇబ్బందులు, వాటి పరిష్కార మార్గాలను వివరించారు. బసవతారకం ఆసుపత్రి మెడికల్ డైరక్టర్ డా. టియస్ రావు మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణల కారణంగా చికిత్స అందించే పద్దతులు ఆధునీకరించబడుతున్నాయని అన్నారు. ఈ చికిత్సా పద్దతులతోపాటూ వైద్యులు తమ అనుభవాలను, నైపుణ్యాలను ఇలాంటి కార్యశాలలో తెలియజేయడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించే వీలవుతుందన్నారు. వైద్యులు డా. చంద్రశేఖరరావు, డా జియస్ రాజు, డా ముక్తా శ్రీనివాసులు, డా. ప్రతాపరెడ్డి, డా. కల్పనా రఘునాథ్, డా. ఫణి కోటేశ్వర రావు, డా సెంథిల్ రాజప్ప, డా. సుజిత్ పట్నాయక్‌తోపాటు హాస్పిటల్‌లోని వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, తెలంగాణా నలుమూల నుండి వచ్చిన అంకాలజిస్టులు, సర్జన్స్, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్ధికి అవార్డుల పంట



పేరి నాగేశ్వర్ కు అవార్డులను ప్రధానం చేస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ పంపాటి నగేష్

**చిక్కడపల్లి మార్చి 1 ( ప్రభాతవార్త ) :**

సమాజ సేవ, నిస్వార్థ అంకితభావం లక్ష్యంగా ముందు కు సాగుతున్న లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్ది 202425 సంవత్సరానికి గాను పలు ప్రతిష్టాత్మక అవార్డులను కైవసం చేసుకుంది. ఆదివారం లయన్స్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో, లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పంపాటి నగేష్ ఈ అవార్డులను క్లబ్ కార్యదర్శి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయలక్ష్మి లకు ప్రదానం చేశారు. విద్య, వైద్యం, పర్యావరణం, ఆకలి నిర్మూలన వంటి కీలక రంగాల్లో క్లబ్ చేసిన విస్తృతమైన సేవలకు గాను జిల్లా మరియు మల్టిపుల్ స్థాయిలలో ఈ గౌరవ గుర్తింపులు లభించాయి. బెస్ట్ స్కూల్ అడాప్షన్ , ఎక్సలెంట్ హంగర్ రిలీఫ్ , ఎక్సలెంట్ ట్రీ ప్లాంటేషన్, అవుట్‌స్టాండింగ్ హెల్త్ క్యాంప్స్ అవార్డు లను కైవంచుకున్నారు. బెస్ట్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ గా పేరి నాగేశ్వర్ రావు అవార్డు దక్కించుకున్నారు. పంపాటి నగేష్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ శతాబ్ది సభ్యుల సేవలను ముక్తకంఠంతో కొనియాడారు. క్లబ్ పూర్వాధ్యక్షులు కందాల శ్రీనివాస్, కార్యదర్శి పేరి నాగేశ్వరరావు నాయకత్వాన్ని,క్లబ్ సభ్యులందరి సమష్టి కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## దోమల నివారణపై బిజెపి ధర్నా



ధర్నాలో పాల్గొన్న బిజెపి శ్రేణులు

**నిజాంపేట్, మార్చి 1, ప్రభాతవార్త**

డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలకు కారణమవుతున్న దోమల సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని బిజెపి శ్రేణులు డిమాండ్ చేశారు. ఆదివారం బాచుపల్లిలో కాసాని సంతోష్, గజ్జల సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నాలో ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి మాట్లాడుతూ పెరుగుతున్న దోమల కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ ప్రాంతంలోని డ్రైనేజీలు, చెరువులు, మౌలిక వసతులు సరిగా లేకపోవడం వల్లే దోమల వ్యాప్తి పెరుగుతోందని ఆరోపించారు. వెంటనే ఫాగింగ్, శానిటేషన్ చర్యలు చేపట్టి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, కార్పొరేషన్ అధ్యక్షులు ప్రసాద్ రాజు, భిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, రచ్చ చక్రధర్, దాసు నాగరాజు, పద్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో జిల్లా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## ముషీరాబాద్ ఐటీఐలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమం



ప్రసంగిస్తున్న చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు

**చిక్కడపల్లి మార్చి 1 ( ప్రభాతవార్త ) :** విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ముషీరాబాద్ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బందితో కలిసి విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ పెరుగుతున్న వాహన రద్దీ దృష్ట్యా ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి (పిలియన్ రైడర్) కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారందరూ రక్షణ కోసం సీట్ బెల్ట్ ధరించడం విస్మరించకూడదు, వాహనాలను ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం, కావున సరైన పద్ధతిలోనే ఓవర్‌టేక్ చేయాలి, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం, అతివేగం మరియు నిరక్ష్యంగా వాహనాలు నడపడం ప్రాణాలకే ముప్పు, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు వాడటం వల్ల ఏకాగ్రత దెబ్బతిని ప్రమాదాలు జరుగుతాయి, మద్యం తాగి వాహనం నడపడం నేరమే కాకుండా మృత్యువును ఆహ్వానించడమేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, అడిగిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తామని విద్యార్థులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, ఎస్ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత పాటించని హోటళ్లు...తనిఖీ చేయని జిహెచ్ఎంసి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు

**గోషామహల్,మార్చి 1ప్రభాతవార్త:** మున్సిపల్ ఉన్నతాధికారుల ఉదాసీనత.... క్రింది స్థాయి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల అవినీతి వెరసి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్న హోటళ్లు ప్రజల అనారోగ్యానికి కారణ భూతాలుగా మారుతున్నాయి. గోషామహల్,నాంపల్లి నియోజకవర్గాలలోని పలు ప్రాంతాల్లోని ఆయా హోటళ్ళలో అపరిశుభ్రత వాతావరణం నెలకొని వాటిలో ఆహారాన్ని భుజించిన ప్రజలు అస్వస్థత పాలవడం జరుగుతుంది. గోషామహల్ నియోజకవర్గంలోని బేగంబజార్, సిద్దింబర్‌బజార్, గౌలిగూడ, అఫ్జల్‌గంజ్, చుడీబజార్, గోషామహల్, దారుసలాం, ఎక్‌మినార్, అబిడ్స్ , హన్‌మాన్‌టేకిడి, దూల్‌పేట్, జీన్సి ఛౌరాహి తదితర ప్రాంతాలలో ఉన్న హోటళ్లలో అపరిశుభ్రత తాండవిస్తోందన్నారు. కలుషీత నీరు, అపరుభ్రత వాతావరణంలో తయారైన ఇరుకు గదుల్లో ఏర్పాటుతున్న హోటళ్లకు అధికారులు ఏ విధంగా అనుమతులుమంజూరు చేస్తున్నారో అర్దంకావడం లేదు. మహానగరపాలకసంస్థ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సైతం మామూళ్లకు అలవాటు పడి అపరిశుభత ఉన్న హోటళ్ల తనిఖీలను గాలికి వదిలేస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లను చూసి చూడనట్లుగా వదిలి వేయడంతో అవి ప్రజలకు అనారోగ్యాన్ని చేకూర్చుతున్నాయి ముఖ్యంగా కలుషీత నీరు సమస్యాత్మకంగా తయారయ్యింది. హోటల్ నిర్వాహకులు బయట నుండి బోరింగ్ నీటిని తీసుకు వచ్చి హోటళ్లలో వినియోగిస్తున్నారు. ఇక ఆహార పదార్ధాల పరిస్దితి కూడా అధ్వాన్నంగా ఉంటుంది. నాసిరకం నూనెలను వాడి కుళ్లిన కూరగాయలు, మాంసాలను వాడి ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. వీటిని భుజించిన ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న మహానగరపాలకసంస్దశాఖ ఉన్నతాధికారులు అపరిశుభ్రత నెలకొన్న హోటళ్ల విషయంలో తగిన దృష్టి సారించడంలేదు. దీంతో క్రింది స్థాయి సిబ్బంది కూడా ఈ హోటళ్ల నుండి మామూళ్లు తీసుకుని ప్రజా రోగ్యానికి గాలికి వదిలేస్తున్నారు. మహానగరపాలకస ంస్థ ఉన్నతాధికారులు ఏదైనా పరిస్దితి విషమించినప్పుడే కళ్లు తెరుస్తున్నారో తప్ప మిగతా సమయాల్లో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పౌరులు వాపోతున్నారు. హన్‌మాన్‌టేకిడిపరిసరాలలో ఉన్న టిఫిన్‌సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు బయటపరిశుభ్రతగా ఉండగా, వంటలుచేసే రూమ్‌లో పూర్తిగా అపరిశుభ్రతగా ఉంటున్నాయి. ఫుడ్ అధికారులు, సిబ్బంది ఉన్నారా అసలు ఉన్నాడా, లేదా అనుమానం కలుగుతోంది. అంత ఎస్. ఎఫ్. ఐ కన్నుసైగల్లో కొనసాగుతున్నాయి.

నెల కాగానే మాముళ్ల వస్తు న్నాయి. ఉన్నతాధికారులు శాఖ ఇక నైనా స్పందించి అపరి శుభ్రత నెలకొన్న హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు

## గాంధీనగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి , మార్చి 1 ప్రభాతవార్త:**

గాంధీనగర్ డివిజన్ పరిధిలోని ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతంగా ప్రారంభమైంది. ఆధ్య ఐ కేర్ హాస్పిటల్ నేతృత్వంలో , వాసవి ట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని స్థానిక మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేదల కోసం ఇలాంటి శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. పేదలకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించి, మందులు మరియు కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఆధ్య ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ పల్లవి రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు వాసవి ట్యూషన్స్ శ్రీ ప్రభు కుమార్ గారిని మరియు వారి సిబ్బందిని అభినందించారు. బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, దామోదర్, వియస్టి రాజు, పి.నర్సింగ్ రావు, ఆనంద్ రావు, సాయి కుమార్, జ్ఞానేశ్వర్, సతీష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలకు ఆహ్వానం

**నాంపల్లి, మార్చి 1 ప్రభాతవార్త :**

2026 సంవత్సరానికిగాను తెలంగాణ సారస్వత పరిషత్తు తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలకు తెలంగాణ రాష్ట్రవ్యాప్త రచయితల నుండి ఆహ్వానిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య తెలిపారు. 2024, 2025 సంవత్సరాలలో తొలిసారి ముద్రణ పొందిన పుస్తకాలు ఈ పోటీకి అర్హమవుతాయని ప్రకటించారు. పద్య / గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, బాలసాహిత్యం, సాహిత్య విమర్శ, ఇతర ప్రక్రియలు అనే ఏడు విభాగాలలో 20వేల నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు ఆయన వివరించారు. కవిత్వం 60 పుటలకు (పేజీలు), మిగతా ప్రక్రియల్లో పుస్తకాలు 100 పుటలకు తక్కువ ఉండరాదు. ప్రత్యేకంగా పిల్లలకోసం అన్ని ప్రక్రియల్లో చేసిన రచనలు బాలసాహిత్యం కోవకు వస్తాయి. బాలసాహిత్య రచనలకు పుటల పరిమితి లేదు. ఎం.ఫిల్, పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథాలు పోటీకి పరిశీలించబడవని స్పష్టం చేశారు. ఒకసారి పరిషత్తు పోటీలో ఉత్తమ గ్రంథ పురస్కారం పొందినవారు మళ్లీ పోటీకి పంపరాదు. పోటీకి గ్రంథాలు పంపేవారు జన్మతః తెలంగాణ వారై ఉండాలని, ఇతర ప్రాంతాల వారు పోటీకి అర్హులు కారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9603727234 మొబైల్ నంబరులో సంప్రదించవచ్చునని, రచయితలు తమ పుస్తకాలను మూడు ప్రతుల చొప్పున తెలంగాణ సారస్వత పరిషత్తు, బొగ్గులకుంట, తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్–500001 చిరునామాకు 2026 మార్చి 25లోగా పంపాలని జె.చెన్నయ్య తెలిపారు.

### జనప్రియానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నికలు నిర్వహించాలి

**యూసుఫ్‌గూడ, మార్చి 1, ప్రభాతవార్త :** గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని జనప్రియానగర్ బస్తీలో అధ్యక్షుని ఎన్నికలు సకాలంలో జరిపించాలని కోరుతూ ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నారు. బస్తీలో ఎన్నికలు జరిగి దాదాపు ఐదు సంవత్సరాలు పూర్తయ్యిందని అధ్యక్షుని పదవీకాలం అయిపోయినప్పటికీ ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో బస్తీ వాసులంతా ఏకతాటి పైకి వచ్చి స్థానికంగా సమావేశం నిర్ణయించుకోవటం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. తొందర్లోనే మరో సమావేశం ఏర్పాటు చేసుకుని ఎన్నికల తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.రామారావు, గోపాల్‌నాయక్, వెంకటేష్, లక్ష్మీనారాయణ, శ్రీహరి, శ్రీనివాస్ నేత, నరసింహారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జనప్రియానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుని పదవీ కాలం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడం పట్ల ప్రస్తుత అధ్యక్షులు కొండమ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తాము ఎన్నికల నిర్వహణకు వ్యతిరేకులం కామని తమ పదవీకాలం పూర్తయినప్పటికీ తాము ప్రజలకిచ్చిన వాగ్దానాలల్లో స్థానికంగా దేవాలయాల నిర్మాణం దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని అవిపూర్తయిన తర్వాత తాము ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమేనని పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశం గురించి తనకుగాని కమిటీ సభ్యులకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొందరు ఏకపక్షంగా సమావేశం నిర్వహించారని ఆరోపించారు.

## కూకట్‌పల్లిలో 20 కెపిహెచ్‌బిలో 7 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 1, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మద్యం మత్తులో వాహనాలు నడిపి పోలీసులు చేపట్టిన తనిఖీల్లో దొరికారు. దీంతో కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 20 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు కెపిహెచ్‌బి కాలనీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

## విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి : బండి రమేష్



స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 1, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్ పేర్కొన్నారు. మూసాపేట జనతానగర్‌లోని కే రోడ్డు హై స్కూల్ కేర్ గుడ్ హై స్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటుందన్నారు. పిల్లలకు ఆస్తులు పంచకపోయినా మంచి విద్యను అందించడం ద్వారా వారి జీవితంలో చక్కగా స్థిరపడేలా చేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు నిర్వాహకులు సుభాష్ చంద్రబోస్, రజనీ, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కుమార్తెపై మారుతండ్రి లైంగిక వేధింపులు

**జూబ్లీహిల్స్, మార్చి 1, ప్రభాతవార్తః**

కుమార్తెపై మారుతండ్రి లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన ఫిల్మ్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో నివసించే ఒక బాలిక(16)తో ఆమె మారుతండ్రి కొంత కాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. బాలిక వ్యక్తిగత భాగాలను తాకేవాడు. ఇంట్లో తల్లిలేని సమయంలో ఇలా పలుమార్లు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. జరిగిన సంఘటనను బాలిక తల్లి దృష్టికి తీసుకెళ్లగా ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితుడైన మారుతండ్రి శేఖర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంఎస్ మక్తాలో తప్పిపోయిన బాలుడు..



తప్పిపోయిన బాలుడు వెంకటాద్రి.

**బేగంపేట మార్చి 1,ప్రభాతవార్త**

లేక్‌పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖైరతాబాద్ ఎంఎస్‌మక్తాలో 13సంవత్సరాల బాలుడు అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదమ నాగరాజు అనే డ్రైవర్ కుటుంబం ఎంఎస్ మక్తాలో నివాసం ఉంటుంది. ఫిబ్రవరి 27న సాయంత్రం ఇంటికి వచ్చిన నాగరాజు చిన్న కుమారుడు వెంకటాద్రి(13) రాత్రి 8గంలకు ఆడుకోవడానికి బయటకు వెళ్లాడు. రాత్రిగం 10లకు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఈ సమయంలో ఆలస్యంగా ఇంటికి రావ డంపై తండ్రి వెంకటాద్రిని మందలించాడు. భయపడిన బాలు డు వెంటనే ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో బాలుడు కుటుంబ స భ్యులు బంధువుల ఇళ్లు, బస్‌స్టేషన్లు ,రైల్వేస్టేషన్లలో గాలించి నా బాలుడి ఆచూకి లభ్యం కాలేదు. దీంతో ఆదివారం లేక్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాలుడు సుమారు 5.4అ దుగుల ఎత్తు, తెల్లని రంగు, సన్నగా ఉంటాడన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో తెలుపు రంగు కుర్తా, నల్ల ఫ్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. కుడిభు జంపై మచ్చ ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, బాలుడి సమాచారం తెల్సిన వారు పోలీసుస్టేషన్ లో సమాచారం ఇవ్వాలని తెలియజేయాలని పోలీసులు కోరారు.

## పేదలకు జనఔషధి మందులు ఎంతో మేలు

### -ఎంపి ఈటెల రాజేందర్




తిరుమలగిరిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్, గోపు రమణారెడ్డి తదితరులు

**కంటోన్మెంట్,మార్చి 1 ప్రభాతవార్త:** జన్ ఔషది వేడుకలను పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర మాజీ సైనిక విభాగం సెల్ కన్వీనర్,సామాజిక కార్యకర్త గోపురమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరులగిరిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ మార్కెట్ ధరల కంటే 50 శాతం నుంచి 90 శాతం వరకు అతి తక్కువ ధరలకు మందులను విక్రయించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్ ఔషద పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాను మల్లికార్జున్, లైఫ్ స్పాన్ యజమాని డాక్టర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాలో అంతరాయం ఎందుకు?

**ఖైరతాబాద్, మార్చి 1 ప్రభాతవార్త :**
ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల బస్తీలు, కాలనీలలో రోజు విడిచి రోజు వచ్చే మంచినీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం 10:30 గంటలకు రావాల్సిన నీరు మధ్యాహ్నం లేదా సాయంత్రం సమయాల్లో వస్తుండటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమయపాలన లేకుండా నీరు విడుదల చేయడం వల్ల మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన సమాధానం ఇవ్వకుండా సాకులు చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. బిజేఆర్ నగర్, ఇందిరానగర్, నెహ్రూనగర్, మారుతినగర్, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఆనంద్ నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకుని సమయపాలనతో మంచినీటి సరఫరా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## హోలీ పండుగకు అంతా సిద్ధం

**ఖైరతాబాద్, మార్చి 1 ప్రభాతవార్త :**
రంగుల పండుగైన హోలీను పురస్కరించుకుని ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానికులు, నిర్వాహకులు తెలిపారు. బస్తీలు, కాలనీల్లో ప్రత్యేకంగా డ్రమ్ములు ఏర్పాటు చేసి హోలీ సంబరాలకు సన్నద్ధమయ్యారు. యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనేలా రంగులు, నీటి ట్యాంకర్లు తదితర ఏర్పాట్లు చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా స్థానిక ప్రజలతో కలిసి వేడుకల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఈ హోలీ సంబరాల్లో ప్రముఖులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## 'లవ్ జిహాద్' పుస్తకం ఆవిష్కరణ




లవ్ జిహాద్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

**సైఫాబాద్, మార్చి 1 ప్రభాతవార్త:** మలుపు బుక్స్ నిర్వహణలో శ్రీనివాసన్ జైన్, అలావి, సుప్రియా శర్మ రచనలతో నర్ల రవి అనువాదంలో వచ్చిన 'లవ్ జిహాద్' ఇతర అభూత కల్పనలు, అసత్య కథనాల గుట్టు విప్పే వాస్తవాలు అనే పుస్తకాన్ని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి రాత్రి బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్ పూర్తిగా కూలిపోయిందని అనుకుంటున్న తరుణంలో ఈ పుస్తకంలోని రచనల గురించి మాట్లాడుకుంటున్నామని, ప్రజలకు నిజం చెప్పే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ పుస్తకాన్ని దేశంలోని అన్ని భాషల్లో ముద్రించాల్సిన అవసరం ఉందని, ప్రచారం చేస్తూ, చర్చ జరగాలన్నారు. రచయితలు చాలా పరిశోధనలు చేసి ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందన్నారు. సచార్ కమిటీ ముస్లింల స్థితిగతుల గురి ంచి చాలా వివరంగా నివేధిక ఇచ్చిందని, చాలా దుర్భరమైన స్థితిలో వారున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలహాబాద్ కుంభమేళాకు కే ంద్రం 25 వేల కోట్లు ఖర్చు చేసిందని, కాని ముస్లింలకు ఇచ్చే స్మశానవాటికలకు స్థలం ఇస్తే వివాదం వస్తున్నదన్నారు. ఈ సభకు రచయిత ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అధ్యక్షత వహించగా పుస్తకాన్ని సామాజిక శాస్త్రవేత కల్పనా కన్నబిరన్ పరిచయం చేశారు. ఈ సభలో శ్రీనివాస్‌జైన్, సమీల్ నిషాత్, అంబటి నాగయ్య, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## హనుమంతరావుకు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వాలి

### అంబర్‌పేట్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం శ్రీధర్‌గౌడ్



వి.హనుమంతరావుకు రాజ్యసభ్యత్వం ఇవ్వాలని మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అంబర్‌పేట్ కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావుకు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వాలని అంబర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం శ్రీధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అంబర్‌పేట మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కోసం నిరంతరం కృషి చేసిన హనుమంతరావు, బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడి, న్యాయం కోసం పోరాడే ఏకైక వ్యక్తి అని, అటువంటి నాయకునికి రాజ్యసభ సభ్యత్వం ఇవ్వాలని యావత్ తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ అధినాయకత్వం స్పందించి, హనుమంతరావుకు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, పుల్లా నారాయణస్వామి, ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ, దిడ్డి రాంబాబు, పులి జగన్, యాదగిరిగౌడ్, రమేష్, శంబుల శ్రీకాంత్‌గౌడ్, ప.రాంమోహన్‌రావు, కోటం అనిల్‌కుమార్, ఎడెల్లి నరపభాకర్, జామీర్‌బాయి,సుధాకర్,బింది మల్లిఖార్జున్ గౌడ్, ఎడెల్లి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌ను గ్రేటర్‌లో విలీనం చేసేంత వరకు కలిసికట్టుగా ఉద్యమించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



జేఏసీ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,మార్చి 1 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 8 వార్డులలోని ప్రాంతాలను జిహెచ్‌ఎంసీలో విలీనం చేసేంత వరకు పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా ఉద్యమించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం తిరుమలగిరిలోని జయలక్ష్మి గార్డెన్‌లో 60 కాలనీల ప్రతినిధులు,జేఏసి ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కంటోన్మెంట్ మెర్జర్ కోసం ప్రజలంతా కలిసి కట్టుగా ఉద్యమించాలన్నారు. కంటోన్మెంట్ ప్రజల తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా కేంద్ర ప్రభుత్వం రాచరిక పాలనతో నామినేటెడ్ వ్యవస్థతో ప్రజలపై పెత్తనం చేస్తుందన్నారు. ప్రజా స్వామ్యాన్ని అపహస్యం చేస్తుందన్నారు. అభివృద్ధికి దూరంగా ప్రజలు జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో బోర్డు ప్రాంతాలను విలీనం చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కంటోన్మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పోరేషన్‌లో మెర్జర్ అయ్యేంత వరకు పార్టీలకు అతీతంగా జేఏసి ప్రతినిధులు పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కంటో న్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్, కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత, ముప్పిడి మధుకర్‌తో పాటు 60 కాలనీలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలు...ఆకట్టుకున్న నమూనాలు




భారతీయ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**చాంద్రాయణగుట్ట, మార్చి 1, ప్రభాతవార్త :** జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పాతబస్తీ దారుల్ ఉలూమ్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలువాల శ్రీనివాసు ఉపాధ్యాయులతో కలిసి నోబెల్‌ప్రైజ్ గ్రహీత, భారతీయ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో నిగూఢమై ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తాయన్నారు. పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. పలు అంశాలలో విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ నమూనాలను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సమీనా సిద్ధిఖీ, మధుసూదన్‌రావు, అనిత, ఆయేషా, విద్యార్థులు పాల్గొన్నారు.

**గౌలిపురా జ్ఞాన భారతిలో....**
గౌలిపురా అయోధ్యనగర్‌లోని జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్‌లో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సురేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగటానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు పలు అంశాలలో రూపొందించిన నమూనాలు ఆహూతులను, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి. ప్రభాకర్ రావు, అతిథులు రాజ్ నారాయణ్ ముదిరాజ్, ఆకుల శ్రీరాములు, రాధిక, కృష్ణమూర్తి, డి.మల్లయ్య, వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు సిహెచ్.శ్రీలత, జయలక్ష్మి, నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



వడ్డెర బస్తీలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేత బద్రి నాథ్ యాదవ్

**అడ్డగుట్ట,మార్చి 1 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికటికి తెచ్చి త్వరితగతిన పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నేత బద్రి నాథ్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఈస్ట్ మారేడ్‌పల్లి, వడ్డెర బస్తీ,ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు,డ్రైనేజీ, మంచినీరు వంటి సమస్యలతో పాటు కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.

## బండి సంజయ్‌కు స్వర్ణ తెలంగాణ పుస్తకం అందజేత



కేంద్రమంత్రి బండి సంజయ్‌కి స్వర్ణతెలంగాణ పుస్తకాన్ని అందచేస్తున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రి, మార్చి 1ప్రభాతవార్త:**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఆదివారం నాంపల్లిలోని తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి సీనియర్ నాయకులు,మహేష్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ వైస్ చైర్మన్ గోవింద్ నారాయణ రాఠి కలసి స్వర్ణ తెలంగాణ పుస్తకాన్ని అందచశారు.ఈకార్యక్రమంలో బిజెపి గోల్కొండ జిల్లా అధ్యక్షులు టి.ఉమామహేంద్ర,ఉత్సవ సమితి ప్రతినిధులు కరోడి మల్ నర్సింగ్‌పూరియా,రామరాజు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంను కలిసిన యాదగిరి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శాలువాతో సన్మానిస్తున్న బొజ్జ యాదగిరి

**నాచారం, మార్చి 1 ప్రభాతవార్త :** రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను దళిత జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ యాదగిరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బొజ్జ యాదగిరి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు అన్ని శాఖల్లో ఉద్యోగ అవకాశాలను భర్తీ చేయాలని, ముఖ్యంగా రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే నింపాలని మంత్రిని కోరారు.అలాగే గత ప్రభుత్వంలో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ఇళ్లు లభించగా, చాలా మందికి ఇప్పటికీ అందలేదని మంత్రికి వివరించారు. మిగిలి ఉన్న ఇళ్లను ఈ ప్రభుత్వంలో గానీ, గత ప్రభుత్వ కాలంలో గానీ దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ అందజేయాలని కోరారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శాలువాతో బొజ్జ యాదగిరి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకుడు చేర్యాల బాలయ్య, బీసీ నాయకుడు కూనూరు కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి నిరంతరం కృషి : బానుక నర్మధ

**కంటోన్మెంట్,మార్చి 1 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 6వ వార్డు మర్రి రామ్‌రెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. ఆదివారం మర్రిరామ్‌రెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 10 నెలల్లో 15 కోట్ల నిధులతో కంటోన్మెంట్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి వచ్చినట్లైతే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

## నేత్రపర్వం భారతీయ శాస్త్రీయ నాట్యోత్సవం



భారత శాస్త్రీయ నాట్యోత్సవంలోని దృశ్యాలు

**రవీంద్రభారతి, మార్చి 1 ప్రభాతవార్త :** ప్రముఖ సంస్థ మదాలస ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో భారతీయ శాస్త్రీయ కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు భావ రస నాట్యోత్సవం శీర్షికన అంగరంగ వైభవంగా జరిగి నేత్రపర్వం కావించింది. ప్రఖ్యాతిగాంచిన నాట్యాచార్యులు కళారత్న సౌజన్య శ్రీనివాస్ భరతనాట్యం, కూచిపూడి నృత్యరీతిలో విఘ్నరాజం భజే అని గణపతి స్తుతితో ప్రారంభమై మధురాష్టకం ఆఖరి అంశంగా ముగియగా ప్రముఖ నాట్యగురు ప్రమోద్‌రెడ్డి–అభినేత్రి ఎన్‌సెంబుల్ మీనాక్షి పంచరత్నం, రామామృతం అంశాలను భరతనాట్య రీతిలో అబ్బురపరచగా; కేంద్ర సంగీత నాటక అకాడమీ యువ పురస్కార గ్రహీత ఎం.సురేంద్రనాథ్, డా. బిజినా సురేంద్రనాథ్‌ల కూచిపూడి శైలిలో శివ నర్తనం, తరంగం అంశాలు శాస్త్రీయ కళావైభవానికి అద్దంపడుతూ కన్నులపండువ చేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ పి.రవి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, వి.బాలాజీ తదితరులు భావ రస నాట్యోత్సవంలో అద్భుత ప్రదర్శనలిచ్చిన ప్రముఖులు కళాకారులను ఘనంగా సన్మానించి ఎంతగానో అభినందించారు.

## రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ

### - జనసేన పార్టీ జాతీయ కార్యదర్శి రామ్ తాలూరి



కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ జాతీయ కార్యదర్శి రామ్ తాలూరి, ప్రచార కార్యదర్శి ఆర్ కె.సాగర్ నాయుడు, సినీ నటుడు తనిష్క్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ బిట్ల రమేష్

**చిక్కడపల్లి మార్చి 1,ప్రభాతవార్త :** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ బిట్ల రమేష్ ఆధ్వర్యంలో జాయినింగ్ ప్రోగ్రాం జరిగింది. ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జన సేన పార్టీ జాతీయ కార్యదర్శి రామ్ తాలూరి, ప్రచార కార్యదర్శి ఆర్ కె.సాగర్ నాయుడు, సినీ నటుడు తనిష్క్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బిట్ల రమేష్ తో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా యువతకు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో జనసేన పార్టీ తెలంగాణలో మరింత బలోపేతం అవుతుందన్నారు. జనసేన సాధక్" ను సంప్రదించి జనసేన ఉద్యమి సభ్యత్వం కోసం నమోదు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బిట్ల రమేష్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పలు డివిజన్ల అధ్యక్షులు నరేష్, కళ్యాణ్, పవన్ గౌడ్, సుబ్బారావు, వంశీ, ప్రవీణ్ కుమార్, వెంకట్, గౌరీ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య..

**పేట్ బషీరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త**
ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ధూలపల్లి, కాజూ స్వీట్ షాప్ సమీపంలో ఉన్న వారి నివాసంలో లావణ్య (30) సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సుమారు ఆరు సంవత్సరాల క్రితం లావణ్యను డ్రైవర్‌గా పని చేస్తున్న, మెదక్ జిల్లా, కొంగెడ్‌కు చెందిన తూపాకుల రవీందర్‌కు ఇచ్చి పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదివారం ఉదయం భార్యాభర్తల మధ్య స్వగ్రామానికి వెళ్లే విషయంపై వాగ్వాదం జరిగింది. అనంతరం లావణ్య గది లోపలికి వెళ్లి తలుపు వేసుకుంది. తలుపు తట్టినా స్పందించకపోవడంతో రవీందర్ తలుపు తాళం పగలగొట్టి లోపలికి వెళ్లగా, లావణ్య సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్న స్థితిలో కనిపించింది. అతను వెంటనే లావణ్య తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విలువలతో కూడిన విద్యార్థులతో దేశభవిష్యత్తు : కృష్ణయ్య



క్రిస్టల్ జూబ్లీ వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ సత్యం తదితరులు

**హైదరాబాద్,మార్చి 1, ప్రభాతవార్త**
పెద్ద అంబర్‌పేట్ శివగంగ కాలనీలోని సత్యం టెక్నో స్కూల్ నిర్వహించిన క్రిస్టల్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్యే పునాది అని పేర్కొన్నారు. గ్రామీణ, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యను అందించడంలో సత్యం టెక్నో స్కూల్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. స్కూల్ చైర్మన్ కరస్పాండెంట్ గుజ్జ సత్యం మాట్లాడుతూ,15ఏళ్ల ప్రయాణం గర్వకారణం. భవిష్యత్తులో డిజిటల్ లెర్నింగ్, ఒలింపియాడ్ ట్రైనింగ్, పోటీ పరీక్షల ప్రత్యేక శిక్షణ, అంతర్జాతీయ ప్రమాణాల ల్యాబ్ సౌకర్యాలు ఏర్పాటు చేయడం మా లక్ష్యం అని ప్రకటించారు. మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ, విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన సామాజిక న్యాయం అన్నారు. భూదాన్ పోచంపల్ మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధన విధానం భవిష్యత్తు విద్యకు మార్గదర్శకమన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ఆర్. అరుణ్ కుమార్ మాట్లాడుతూ, విద్య ద్వారా సామాజిక శక్తివంతీకరణ సాధ్యమని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దండం రామ్‌రెడ్డి,బిస్మాట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. శేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డైరెక్టర్ గంజి అరవింద్, నేషనల్ హ్యాండ్లూమ్ బోర్డ్ మాజీ డైరెక్టర్ తడక యాదగిరి, త్రివేణి సాహితి అధ్యక్షుడు పట్నం కృష్ణకుమార్, బీసీ వెల్ఫేర్ సౌత్ ఇండియా ఇన్‌చార్జ్ సూర్యనారాయణ, స్కూల్ డైరెక్టర్లు జిల్లా వెంకటేశం, గుజ్జ అపర్ణ, సౌజన్య,పద్మ పాల్గొన్నారు.

## పుస్తక సమీక్షలు సులువు కాదు : డా. కె.వి.రమణాచారి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, దేవాసు, నరసింహారెడ్డి, విహారి, సుధామ, సింహప్రసాద్, చిదంబరం తదితర అతిథులు

**రవీంద్రభారతి, మార్చి 1 ప్రభాతవార్త :** వివిధ రచయితల రచనలను రచయిత మూలభావాన్ని క్లుప్తసుందరంగా ఆసక్తికరంగా అందించే పుస్తక సమీక్ష సమీక్షకులకు ఏమాత్రం సులువు కాదని, కత్తిమీద సాములాంటిదని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విశాఖ సంస్కృతి మాసపత్రిక, సామిత్రి పబ్లికేషన్స్, శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ సంపాదకుడు బైస దేవదాసు సభాధ్యక్షతన ప్రముఖ రచయిత కూర చిదంబరం రచించిన సమీక్షా సౌరభాలు, సమీక్షా సుమమాలిక గ్రంథాల ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథులు డా. ఏనుగు నరసింహారెడ్డి, విహారి, సుధామ, సింహప్రసాద్, ఎ.బాబూరావు, సన్యాసిరావు, రఘుశ్రీ, రచయిత కూర చిదంబరం, రామా చంద్రమౌళి, లలితాశర్మ తదితరులతో కలిసి ఈ రెండు పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమీక్షలు వ్రాసిన చిదంబరం కృషి అమూల్యమన్నారు. అందులో సింహప్రసాద్ రచనలపై వ్రాసిన సమీక్షలతో ప్రత్యేక పుస్తకాన్ని వెలువరించడం అపూర్వమని, ఆయన సాహిత్యకృషి అనితరసాధ్యమని కొనియాడారు. అనంతరం సమీక్షా సౌరభాలు పుస్తకాన్ని తంగిరాల చక్రవర్తికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా కూర శంకరయ్య స్మారక కథా పురస్కారాన్ని రామా చంద్రమౌళికి, శ్రీమతి కూర లలితమ్మ స్మారక పురస్కారాన్ని రచయిత్రి లలితావర్మకు ప్రదానం చేశారు. చివరిగా పుస్తక రచయిత కూర చిదంబరం దంపతులను అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. మానస ఉపాధ్యక్షురాలు డా. లలితవాణి, కార్యదర్శి రఘుశ్రీలు సభాసమన్వయం కావించారు.

### రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఆనంద్ ఎన్నిక

**యూసుఫ్‌గూడ, మార్చి 1, ప్రభాతవార్త :** ప్రతి రెండు సంవత్సరాల కొకసారి జరిగే రాజీవ్‌గాంధీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ రాజీవ్‌గాంధీనగర్ బస్తీలో మొత్తం 810 ఓట్లు ఉండగా 765 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుని పోటీలో ఆనంద్‌కు 423 ఓట్లు పోలవ్వగా మరో అభ్యర్థి శాంతకుమార్‌కు 323 ఓట్లు పోలయ్యాయి. వంద ఓట్ల మెజారిటీతో ఆనంద్ అధ్యక్షునిగా గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా గెలుపొందిన ఆనంద్ మాట్లాడుతూ బస్తీలో తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన బస్తీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలకు అధికారిగా సునీల్ వ్యవహరించారు.

## వృద్ధులకు పండ్లను పంపిణీ చేసిన మాజీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి




ఓల్డేజ్ హోంలో వృద్ధులతో మాట్లాడుతన్న శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక మార్చి 1 ప్రభాతవార్త :** నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి తో కలిసి తార్నాకలోని శ్రీ సాయి అమృత సీనియర్ సిటిజన్స్ ఓల్డ్ ఏజ్ హోమ్ లో ఆదివారం వృద్ధులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి వారి ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ వృద్ధుల సేవ చేయడం తనకు అపారమైన ఆనందం, తృప్తిని కలిగిస్తుందని పేర్కొన్నారు. సమాజానికి తమ జీవితాన్ని అంకితం చేసిన పెద్దల పట్ల గౌరవం, ప్రేమ చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వృద్ధుల ఆరోగ్యం, భద్రత, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు, సిబ్బంది, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొని శ్రీలత శోభన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## దేశ తరగని సంపద శాస్త్రీయ కళలే : కోలేటి దామోదర్‌గుప్తా

**రవీంద్రభారతి, మార్చి 1 ప్రభాతవార్త :** కళలకు కుల మత జాతి ప్రాంతీయ భాషా వివక్షతలు ఉండవని, దేశ సంస్కృతి, సంప్రదాయాలకు పట్టుగొమ్మలు, తరగని సంపద ఆ దేశ శాస్త్రీయ కళలేనని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. అలాంటి భారతీయ కళలన్నింటిని కాపాడుకుంటూ, ప్రోత్సహిస్తూ ముందుతరాలకు తీసుకువెళ్లాలని, అలాంటి అనితరకృషి చేస్తున్న జైజవాన్ జైకిసాన్ జై కళాకార్ సంస్థను వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు కళాసేవలను కొనియాడుతూ మన కళలను జాతీయ రవీంద్రభారతి కళామందిరంలో కళాభిషేకం కావిస్తూ కళలను నేర్పిస్తున్న గురువులను, సుశితులై ప్రదర్శనలిచ్చిన కళాకారులను దామోదర్‌గుప్తా ఆత్మీయ అతిథులు డా. బాబుమిరియం, ఎస్.నరేష్, లయన్ కె.వి.రమణారావు తదితరులతో కలిసి అవార్డులు, జ్ఞాపికలతో గౌరవించి ప్రోత్సహించడం అనిర్వచనీయమని లబ్ధప్రతిష్టులకు శుభాభినందనలు తెలిపారు. అనంతరం బహుముఖ ప్రతిభావంతురాలు భవనం జ్యోతిరెడ్డి, కళాగురువులు డా. పి.ఝాన్సీరామ్, ఎన్.సుధాకర్‌రెడ్డి, రష్మిత, ఎన్.అనితర కృష్ణంరాజు, ఎ.అంజన,ఎన్.చాయాచంద్రిక, వై.మీనాక్షి తదితరులను జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కళాభిషేకంలో నాట్యకళాకారుల నృత్యవిన్యాసాల కళాప్రదర్శనలు అంబరాన్నంటి ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి.

## ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తే హిందూ సమాజం తిరగబడుతుంది

### - విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య ప్రముఖ్ బాలస్వామి



కోకాపేట్ శారదాపీఠం స్వామీజీతో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య ప్రముఖ్ పి.బాలస్వామి.

**నార్సింగి, మార్చి 1 ప్రభాతవార్త :** తెలంగాణ సర్కారు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడితే హిందూ సమాజం తిరుగబడుతుందని విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి హెచ్చరించారు. ఆదివారం ఆయన కోకాపేట్‌లోని శారదాపీఠంకు వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి స్వాత్మానంద స్వామితో పాటు మరికొంత మంది స్వామీజీలను కలిసి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యాయపరంగా అన్ని హక్కులున్న శారదాపీఠంను తొలగించే కుట్ర చేయడం హిందూ భక్తుల విశ్వాసాలను గాయపర్చడమేనని తెలిపారు. స్వామీజీలను అవమానించేలా చర్యలు తీసుకోవడం తీవ్ర అభ్యంతరకరమని ఆక్షేపించారు. పీఠం భూముల పరిరక్షణకు ప్రత్యేక జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మఠాలు, పీఠాలు, మందిరాలపై దాడులు చేస్తే సహించబోమన్నారు. సరైన గుణపాఠం చెప్పి తీరుతామన్నారు. కోకాపేటలోని పీఠం విషయంలో సర్కారు చర్య సహించరానిదని, వెంటనే బహిరంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శారదా పీఠం కేవలం భూమి కాదని, భక్తుల విశ్వాసానికి నిలయమన్నారు. వేదాధ్యాయానికి కేంద్రంగా, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తున్న పీఠాలపై పగబట్టి కూల్చాలనుకోవడం హిందూ వ్యతిరేక చర్య అవుతుందన్నారు. ధార్మిక సంస్థల భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలన్నారు. ఏకపక్ష నిర్ణయాలు సరికాదన్నారు. సనాతన సాంప్రదాయాల పరిరక్షణలో స్వామీజీల పాత్ర అపారమైందని, వారిని అవమానించేలా చర్యలు తీసుకుంటే విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రజలందరిని కదలించి ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి నాయకులు రామారావ్, రంగనాథ్, అంకిత్, మహేష్, శంకర్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MEDCHAL**
**O.S. No. 47 OF 2026**

Between:
1. **Atluri Uma,** W/o. Late Atluri Mangi Reddy, Aged: 49 years, Occ: House Wife, R/o.H.No.06 -293/2/4/A/4, Plot No-58, Venkateswara Colony, Suchitra, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District 500055.
2. **Atluri Vasavi,** D/o. Late Atluri Mangi Reddy, Aged: 30 years, Occ: Private Job, R/o.H.No.06 -293/2/4/A/4, Plot No-58, Venkateswara Colony, Suchitra, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District 500055.
3. **Atluri Swathi,** D/o. Late Atluri Mangi Reddy, Aged: 28 years, Occ: Private Job, R/o.H.No.06 -293/2/4/A/4, Plot No-58, Venkateswara Colony, Suchitra, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District 500055.
4. **Atluri Sri Vidya,** D/o. Late Atluri Mangi Reddy, Aged: 23 years, Occ: Private Job, R/o. H.No.06 -293/2/4/A/4, Plot No 58, Venkateswara Colony, Suchitra, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District 500055 ...**Plaintiffs**

And

1. **The Tahsildar,** Quthbullapur Mandal, Medchal-Malkajgiri District.
2. **All concerned.** ...**Defendants**

To
**The all Concerned**
The above Original Suit has been filed by Atluri Uma and 3 Others for Declaration of Legal Heirs against the defendants and the said suit stands posted to **16.03.2026.** You i.e., Defendant No.1 are therefore hereby directed to appear before the Hon'ble Court on **16.03.2026 at 10.30 a.m.** either in person or through Your Counsel/Advocate, failing which the matter will be decided by the Hon'ble Court in Your absence as per law.
//BY THE ORDER OF THE HON'BLE COURT//
**Sd/- M. SAI KUMAR, Advocate**
# Flat No.402, Jyothi Homes Apartments, Sriram Nagar, Suraram Village, Quthbullapur Medchal-Malkajgiri Dist-500055 **Mob.No. +91 9030043844.**

**IN THE COURT OF THE HON'BLE VII. JUNIOR CIVIL JUDGE-CUM VII ADDL METROPOLITAN MAGISTARATE, R.R.DIST: AT : HAYATHNAGAR**
**O.S NO. 174 OF 2024**

Between:
Suggula Prasanna Rao ....Plaintiff
AND
Gaddam Chennamma & others ...Defendants

To,
1.Gaddam Chennamma w/o Late Somaiah, A/a 82 years, House wife
2.Gaddam Narasimha s/o Late Somaiah, A/a 66 years, Occ: Agrl
3. Gaddam Balaiah s/o Late Somaiah, A/a 70 years, Occ: Agrl
4. Gaddam Lakshmamma w/o Balaiah, A/a 65 years, House wife 1 to 4 are R/o Hayathnagar village and Mandal, Rangareddy District.
5.Babitha Bai w/o Mohan Lal Agarwal, A/a 56 years, House wife R/o H.No.3-6-584/H, Himayath nagar, Hyderabad.
6. Vishal Agarwal s/o Om Prakash Agarwal, A/a 49 years, Business R/o H.N.o 13-6-438/A/1 78/1, Satyanarayana Nagar colony, Mehdipatnam 438/A/178 Ring Road, Hyd-028.
7. Komatireddy Srinivas Reddy s/o Lingareddy, aged about 48 years, Driver r/o Goguloribavi h/o kothagudem village,samsthan Narayanapur Mandal,Yedadri Bhuvanagiri Dist
8. Surakanti Janardhan Reddy s/o Dhan Reddy, aged about 48 years, Mechanic r/o Samsthan Narayan apur village and Mandal, Yedadri Bhuvanagiri District .... Defendant No.1to 8

**NOTICE**
Take Notice that the above named Plaintiffs have filed against you the above suit for Declaration of title recovery of possession and declaration that certain registered General Power of Attorney and sale deed executed between Respond ents No.1 to 15 are void ab inito. The said matter is posted on 26.03.2026. If any person/s are having any claim or objection, then they may appear before the above said Hon'ble Court on **26.03.2026** at 10.30 a.m.either in person or through the counsel, failing which the matter will be decided in your absence as per law.

**SUIT SCHEDULE PROPERTY**
All that part and parcel of the Land marked as plot No.60 in Sy. No. 199, admeasuring 250 Sq.yards or equivalent to 209.03 Sq. Mtrs., situated at Bagh Hayathnagar Village, Hayathnagar Mandal, Ranga Reddy District, bounded by: **North:** Plot No. 57, **South:** 25' wide road,**East:** Plot No.61, **West:** Plot No.59
**/ BY ORDER OF THE HON'BLE COURT / VESIREDDY VENKAT REDDY, Advocate,**
O/o. Flat No.302, H.No.13-1-50, Vesireddy Residency, Chaitanyapuri, Hyderabad. Mobile No.94411 19617.

## సమస్యలు వివరిస్తున్న విశాఖనగర్ కాలనీవాసులు

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలో నూతనంగా ఏర్పడిన నాదర్‌గుల్ డివిజన్-57కు సంబంధించిన ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని బడంగ్‌పేట్ సర్కిల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన డివిజన్‌లోని అల్మాస్‌గూడ విశాఖనగర్ ఫేస్-1 కాలనీలో స్థానికులతో కలిసి పర్యటించి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ నుండి రామిడి హిల్స్ గుండా పోచమ్మ గుడి వెళ్లే ప్రధాన రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్నందున మరమ్మతులు చేయించాలని అదే విధంగా కాలనీ పార్కు స్థలానికి ప్రహరీగోడను నిర్మించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన ఆయన కొత్తగా జిహెచ్ఎంసిలో ఏర్పడ్డ డివిజన్ల అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. అభివృద్ధికి దూరంగా ఉన్న కాలనీల్లో సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయించే విషయాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, కృష్ణ, కరుణాకర్, రమేష్ నాయక్, తులసి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రిషి స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** రిషి స్కూల్, రిషి యూరో కిడ్స్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఉప్పల్‌లోని కెకెఆర్ గార్డెన్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నర్సరీ నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో తమ ప్రతిభను చాటుకున్నారు. పిల్లల ఆత్మ విశ్వాసం, సృజనాత్మకత ప్రేక్షకులను ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సి పాల్ రాజ్యలక్ష్మి వార్షిక నివేదికను సమర్పించి, గత విద్యాసం వత్సరంలో పాఠశాల సాధించిన విద్యా మరియు సహపాఠ్య విజయా లను వివరించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ సీస వెం కటేష్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నేత ఎ. బాస్కర్, పలువురు పాఠశాల కరస్పాండెంట్లు హాజరైయ్యారు. రిషి స్కూల్ తక్కువ ఫీజులతో మంచి విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నదని పలువురు ప్రశంసించారు.




## వెలుగని వీధి దీపాలు..పట్టించుకోని విద్యుత్‌శాఖ

**బేగంబజార్, మార్చి 1 ,ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాం తాలలోని ప్రధాన రహదారులలో వేలాది రూపాయలతో వ్యయంతో చేపట్టిన విద్యుత్ వెలుగకపోవడంతో అంధకారంగా మారాయి. రాత్రి వేళల్లో విద్యుద్దీపాల కాంతులతోధగ ధగ మెరవలసిన రహదారులు ప్రస్తుతం చీకటి మయంగా మారుతున్నాయి .ముస్లీం జంగ్‌పూల్‌నుంచి మొదలుకుని బేగంబజార్‌చత్రి, గోషామహల్ ఎసిపి కార్యాలయం రహదారి, కట్టెల మండి, అఫ్జల్‌గంజ్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీనుంచి మొదలుకుని సిబిఎస్ వరకు, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ ప్రక్క రహదారినుంచి రాంనాథ్ ఆశ్రమం రహదారి పూర్తిగా అంధకారంగా నెలకొం టుంది. ఈ రహదారులలో తరుచుగా చిన్న చితక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మహానగరపాలకసంస్థ, ట్రాన్స్‌కో విభాగాల అధికా రులకు, సిబ్బందికి సమన్వయంలేకపోవడంతో ఉన్న విద్యుత్‌దీపాలు వెలుగడంలేదు. పీల్ ఖానా, గోషామహల్ తదితర ప్రాంతాలో ఉన్న ట్రాన్స్‌పోర్టు యజమానులు లారీలను రోడ్లపై రాత్రివేళల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుం టారు. ఇతర జిల్లాలకు తరలించే సరుకులను ఫుట్‌పాత్‌లపై పెట్టి లోడింగ్ చేస్తుంటారు. ఆటు గోషామహల్ ట్రాఫిక్ పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుంటారు. ఇప్పటికైనా పోలీసులు అధికారులు, ట్రాన్స్‌కో, మహనగర పాలకసంస్థ అధికారులు తగిన చర్యలు తీసుకుని విద్యుత్ దీపాలు వెలిగే విధంగా చూడాలనిప్రజలు కోరుతున్నారు.

### నేటితో ముగియనున్న డిసిసి అధ్యక్షుల శిక్షణా శిబిరం- రాహుల్ పర్యటనకు ప్రాధాన్యం

# కీలక నిర్ణయాలు?



- డిసిసి చీఫ్‌లతో ముఖాముఖి కానున్న రాహుల్
- పార్టీ వ్యవహారాలపై ఇక్కడి నుంచే కీలక నిర్ణయాలు
- రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం
- సామాజిక అంశాలు, పార్టీ విధేయత తదితర అంశాల ప్రాతిపదికన ఖరారు

ప్రభాతవార్త, **వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వికారాబాద్ పర్యటన అత్యం త ప్రాధాన్యత సంతరించుకుంది. ఈనెల 2వ తేదీన అనంతగిరిలో డిసిసి అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. ఆయన కేవలం డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపు కార్య క్రమానికే పరిమితం కాకుండా పలు కీలక నిర్ణయాలను ఇక్కడే తీసుకుంటారని పార్టీవర్గాల సమాచారం. రాష్ట్రంలో ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలకు అభ్య ర్థుల ఎంపిక చేయనున్నారని భావిస్తున్నారు. సామాజిక అంశాలు, పార్టీ విధేయత తదితర ప్రాతిపదికన అభ్యర్థులను ఖరారు చేస్తారని అంటున్నారు.

**రోడ్డు మార్గాన హరిత రిసార్టుకు..**

రాహుల్ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10:20 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరు కుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వికారాబాద్‌కు బయలుదేరుతారు. కేవలం 10 నిముషాల వ్యవధిలో వికారాబాద్ చేరుకుంటారని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన హరిత రిసార్టుకు వస్తారని పార్టీవర్గాలు తెలి పాయి. సాయంత్రం 4:30 గంటల వరకు డిసిసి అధ్యక్షులకు దిశానిర్దేశం చేస్తారు. వారి కుటుంబాలతో ఫొటో సెషన్‌లో పాల్గొంటారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు శంషాబాద్‌కు చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లేలా షెడ్యూల్ ఖరారు చేశారు. రాహుల్ పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పూర్తి చేశారు.

**తాండూరు-హైదరాబాద్ ప్రయాణికులకు దారి మళ్లింపు?**

భద్రతా వైఫల్యాలు తలెత్తకుండా పోలీసుశాఖ అసాధరణ రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. తాండూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులకు దారి మళ్లిస్తారని సమాచారం. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశించారు. ఆమె పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్ స్వయంగా భద్రతపై సమీక్షించినట్లు అధికారవర్గాల సమాచారం.

**పది రోజులు.. పది లక్ష్యాలు**

అనంతగిరిలో జరుగుతున్న డిసిసి అధ్యక్షుల 10 రోజుల శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 2వ తేదీతో ముగియనున్నాయి. ఏఐసీసీ ప్రతినిధి సచిన్ రావు పర్యవేక్షణలో సంఘటన్ సృజన్ అభియాన్ పేరుతో ఫిబ్రవరి 21న ప్రారభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడం, ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం ఉద్దేశ్యంగా ఈ శిబిరం సాగుతోంది.

## నేడు వికారాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

### వివిఐపిల పర్యటన నేపథ్యంలో వాహనాల మళ్ళింపు : జిల్లా ఎస్‌పి స్నేహామెహ్రా



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** వివిఐపిల పర్యటన నేపథ్యంలో సోమవారం వికారాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరి హరిత రిసార్టుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖులు పర్యటించ నున్న నేపథ్యంలో, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు, ట్రాఫిక్ నిర్వహణ ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. వికారాబాద్ నుండి తాండూర్‌కు అనంతగిరి గుట్ట మార్గంగా వెళ్లే వాహనాలను, తాండూర్ నుండి వికారాబాద్‌కు అనంతగిరి గుట్ట మార్గంగా వచ్చే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గలు అయినా బుగ్గ రామలింగేశ్వర స్వామి రోడ్డు, మెరినాట్స్ మీదుగా జైదుపల్లికి వెళ్ళే రోడ్డు మార్గాల ద్వారా వాహనాలను దారి మళ్ళించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# జన జాగృతే మన లక్ష్యం

### ఎన్నికల కోసమే పార్టీ అనుకోకండి- క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం అవుతూ ప్రజల్లో మమేకమవ్వండి - నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి - డిసిసిలకు మీనాక్షి నటరాజన్ పిలుపు



ప్రభాతవార్త, **వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** క్షేత్రస్థాయిలో మరింత పటిష్టమంతం అవుదామని కాంగ్రెస్ అధ్యక్షులకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉద్బోధించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి రిసార్టులో ఆదివారం జరిగిన డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పలు అంశాలపై మాట్లాడారు. గ్రామాల్లో ఇంకా అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని గుర్తు చేశారు. కుల, మత వైషమ్యాల వల్ల ప్రజలు అభివృద్ధి దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనాలను జాగృతం చేసేందుకు ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల కోసమే పార్టీ అనుకోవడం పొరపాటన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రణాళికా బద్ధంగా డీసీసీలు ముందుకు సాగుతూ పటిష్టమంత నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఆమె సూచించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా పలు అంశాలపై మాట్లాడారు. 9 రోజుల పాటు సాగిన శిక్షణ శిబిరం గురించి డీసీసీ అధ్యక్షులను అడిగి తెలుసుకున్నారు.

# రాజీవ్ రహదారి విస్తరణకు లైన్‌క్లియర్

### భూములు ఇచ్చేందుకు రైతుల సుముఖత

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 1, ప్రభాతవార్త :** రాజీవ్‌రహదారి వెడల్పు (విస్తరణ) కోసం భూములు ఇచ్చేందుకు రైతులు, యజమానులతో అధికా రులు జరిపిన చర్చలలో వారు సుముఖత వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సమక్షంలో డిఎల్ఎన్‌సి సమావేశం జరిగింది. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి చర్చల కమిటీ (డిఎల్ఎన్‌సి) సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సం దర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు రాజీవ్‌రహదారి విస్తరణ పనులు చేపడుతున్నందున దీనిలో భాగంగ పోతాయిపల్లి అవార్డు పాస్ అయిందని, రాజీవ్‌రహదారికి భూమి ఇవ్వటానికి లోతుకుంట రైతులు, స్థల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు రావటం హర్షణీయమని అన్నారు. తమ భూమి ఎంతో విలువైన దని, దానికి తగినట్లుగా మంచి రేటు (సుమారు రూ.1.50,000వరకు) ఇవ్వాలని రైతులు కలెక్టర్‌ను కోరగా కలెక్టర్ స్పందిస్తూ గత మూడు సంవత్సరాలుగ లోతుకుంటలో ఎలాంటి క్రయవిక్రయాలు జరగలేదని అందుకుగాను అల్వాల్ సబ్‌రిజిస్ట్రార్ రికార్డులలో ఆ ప్రాంతానికి సంబంధించిన ధరలను పరిగణలోకి తీసుకుని మంచి రేటు నిర్ణయించామని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం తరపున రైతులకు అత్యుత్తమ రేటు అంది స్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ నిర్ణయంతో రైతులు, యజ మానులు సంతృప్తిని వ్యక్తం చేసి అంగీకారానికి తెలిపినట్లు వివరించారు. దీంతో లోతుకుంట డిఎల్ఎన్‌సి సమావేశం సఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎల్ఎ (ఇండ్స్)స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.మాలతి, హెచ్ఎండిఏ అధికారులు, అల్వాల్ తహసీల్దార్ రాములు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి



మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా, జాతీయ అధ్యక్షుడు కె. సాయిరెడ్డి

## రసాయనిక రహిత వ్యవసాయమే దేశానికి దిక్సూచి కావాలి

### అఖిల భారత కిసాన్ సంఘ్ పిలుపు

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 1, ప్రభాతవార్త:** ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతుల ద్వారానే పంటలు పండించే విధంగా దేశవ్యాప్తంగా రైతులకు తర్ఫీదు ఇవ్వాలని అఖిల భారత్ కిసాన్ సంఘ్ సర్వసభ్యసమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. పోచారం డివిజన్ అన్నోజిగూడ రాష్ట్రీయ విద్యా కేంద్రంలో మూడు రోజుల పాటు అఖిల భారత కిసాన్ సంఘ్ సర్వసభ్య సమావేశం ఆదివారం ముగిసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి దాదాపు 800 మందికి పైగా రైతు ప్రతినిధులు హాజరైనట్లు జాతీయ అధ్యక్షుడు కె. సాయిరెడ్డి తెలిపారు. సమావేశంలో వ్యవసాయం లాభాసాటి కావడంతో పాటు నాణ్యమైన రసాయన రహిత పంటలు పండించే విధంగా రైతులను ప్రోత్సహించాలని సమావేశంలో తీర్మానించినట్లు అఖిల భారత కిసాన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా అన్నారు. సేంద్రీయ వ్యవసాయ పంటల ద్వారానే అన్ని రకాల పండించాలని కల్తీలేని వ్యవసాయ విధానం ద్వారా దేశం రోగరహితంగా ఉంటుందని అన్నారు. రానున్న రోజుల్లో సంఘం బలోపేతం కావడానికి రైతుల సంఖ్యను పెంచుకోవడంతో పాటు రైతుల కొరకు కేంద్రప్రభుత్వంతో పాటు ఆయా రాష్ట్రా ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవడం చేస్తుందని అన్నారు. రైతులకు లాభాసాటి వ్యవసాయంతో పాటు రసానియక రహిత పంటలు పండించే విధంగా చర్యలు చేపట్టాలని సమావేశంలో పలు తీర్మానాలు అమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత సంఘటన కార్యదర్శి దినేశ్ కులకర్ణి, దోనూరు రాము, రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు, ప్రచారక్‌లు ఎవి. రావు, వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భాను శర్మ, రేసు లక్ష్మారెడ్డి, లింగారెడ్డి, కొంతం అంజిరెడ్డి ఆయా ప్రాంతాల నుండి విచ్చేసిన అఖిల భారత కిసాన్ సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన కిసాన్ సంఘ్ ప్రతినిధులు

## మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

### తహసీల్దార్ సుచరితకు వినతిపత్రం

**శామీర్‌పేట, మార్చి 1, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అదే విధంగా కేంద్ర ప్రభుత్వం మత్సకారులకు అందించనున్న సంక్షేమ పథకాలను కూడ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయటంలో నిర్లక్ష్యం చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని మహిళా శక్తి వాయిస్ సంఘం అధ్యక్షురాలు ఎన్.హైమావతి డిమాండ్ చేశారు. శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుచరితను ఆ సంఘం అధ్యక్షురాలు ఎన్.హైమావతి, పలువురు నాయకులతో, మత్స్యకారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా మహిళా శక్తి వాయిస్ సంఘం అధ్యక్షురాలు ఎన్.హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్స రాలు పూర్తి అయినప్పటికీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయటం లేదని విమర్శించారు. సంక్షేమ పథకాలు అందించాల్సి ఉండగ వాటిని కూడ అమలు చేయటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మత్సకారుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కూడ మత్స్యకారులకు అందించటం లేదని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆమె విమర్శించారు. సరైన సమయంలో మత్సకారులకు చేపపిల్లల విత్తనాలు పంపిణీ తగు మోతాదులో ప్రభుత్వం అందించటం లేదని, మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని ఆమె అన్నారు. చెరువుల చుట్టు ఉన్న ఎఫ్‌టిఎల్ భూములను గుర్తించి వాటికి తగు రక్షణ కల్పించాలని, వాటి రక్షణ లేక ఎఫ్‌టిఎల్ పరిధిలో భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆమె వివరించారు. చెరువు, కుంటల్లో ఎఫ్‌టిఎల్ పరిధిలో మట్టితవ్వకాల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం మధ్యాహ్నం భోజనంలో చేపలను అందిస్తామని ప్రతిపాదనలు చేసిందని, దాని గురించి కూడ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఎన్.హైమావతి అన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న పై తెలిపిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, మత్సకారులకు అందాల్సిన సంక్షేమపథకాలను అందించాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి మత్సకారులకు అందించే సంక్షేమ పథకాలు లబ్దిదారులకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం అమలుకు చర్యలు తీసుకోవాలని మహిళా శక్తి వాయిస్ సంఘం ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు అధ్యక్షురాలు ఎన్.హైమావతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్సకార సంఘం నాయకులు, శామీర్‌పేట మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మహిళా శక్తి వాయిస్ సంఘం అధ్యక్షురాలు హైమావతి

## 'పేపర్ లీకేజీ' పునరావృతం కావద్దు

### తాండూరు ఎమ్మెల్యే సీరియస్

### త్వరలో విద్యాధికారులతో సమావేశం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** టెన్త్ పరీక్షల్లో పేపర్ లీకేజీలను అరికట్టాలని ప్రభు త్వం సిద్ధమైంది. గతంలో ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కైన కొంతమంది అధికారులు ప్రతియేటా పదోతరగతి ప్రశ్న పత్రం ముందస్తుగానే లీక్ చేశారని ఆరోపణలు వచ్చాయి. మూడేండ్ల క్రితం ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు వాట్సాప్ ద్వారా టెన్త్ ప్రశ్నాపత్రం ముందుస్తుగానే బయటకు పంపించారు. అయితే, ఆ సంఘటనలో వారిద్దరిపైనే కాకుండా చేయని నేరానికి మరో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. అప్పటి విద్యాశాఖ మంత్రి పీ.సబితారెడ్డి వాస్తవాలను వెలికి తీయాలనే ఉద్దేశ్యంతో పునర్విచారణ జరిపించారు. దాంతో ఇతర మండలాల నుంచి డ్యూటీకి వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయుల ప్రమేయం లేదని విచారణలో తేల్చారు. తాండూరు పట్టణంలోని నెంబర్ వన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులే కీలకపాత్రధారులను నిర్ధారణకు వచ్చారు. దీని వెనక సూత్రధారుల పేర్లు కూడా బయటకు వచ్చినా పోలీసులు వారిని తప్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యాశాఖకే మాయని మచ్చ తెచ్చిన సదరు అధికారులు తప్పించుకున్న సంఘటన తాజాగా మళ్లీ చర్చనీయంగా మారింది. ఈసారి కూడా టెన్త్ పరీక్ష పత్రం లీకేజీ అవుతుందని ప్రచారం సాగుతోంది.

# అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి

### అధికారులకు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం

**కొడంగల్, మార్చి1, ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గంలో మంజూరైన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. ఆదివారం కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో కొడంగల్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై వికారాబాద్, నారాయణపేట్ జిల్లాలకు సంభందించి సంభందిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ కొడంగల్, నారాయణపేట్‌కు సంభందించిన రోడ్ల నిర్మాణ పనులు, ఎలక్ట్రిసిటి, త్రాగునీరు, భగీరధ మిషన్ పైపులు, పంచాయ తీరాజ్, ఆర్అండ్‌బీ, టీజిఇడబ్ల్యు డి,సి పబ్లిక్ హెల్త్ శాఖల ద్వారా ఇప్పటికూ మంజూరైన వివిధ నిర్మాణ పనులు ప్రారంబించిన వాటిని, పూర్తి అయిన పనులను అనుకున్న లక్ష్యం మేరకు పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇడబ్ల్యూఐడిసి ద్వారా మంజూరై మొదలు పెట్టిన నిర్మాణ పను లను వెంటనే పూర్తి చేయాలని, అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలనీ అధికారులకు సూచించారు. వేసవి కాలంలో త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఏదైనా సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని, ఆర్అండ్‌బి ద్వారా చేపట్టే పనులను వెటర్నరీ, వైద్య కళాశాలలకు సంభందించిన పనులను త్వరలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. చేసే పనిలో ప్రోగ్రెస్ ఉండాలని, నిర్మాణ పనులకు సంభం దించిన ఫోటోలు పంపించాలని సూచించారు. అనంతరం టిజిఇడబ్ల్యుయు ఐడిసి ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు, దుద్యాల మండలానికి సంభంచిన ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్స్ నిర్మాణ పనులను హకీంపేట్ రోడ్డు నిర్మాణ పనులకు సంభందించి ఎడ్యూకేషన్ హబ్ నిర్మాణం యొక్క ప్లాన్‌ను పరిశీలించిరు. జరుగుతున్న ప్రతి పనికి సంభందించిన పనులు జరుగుతున్న క్రమంలో ఏవైనా సమస్యలు ఎదురైతే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా వేసవి కాలం ఉన్నందున త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని సంభందిత అధికారులకు ఆదేశం చారు. ముందుగా కడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిం చారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ సుదర్శన్, ఆర్అండ్‌బి ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎలక్ట్రిసిటి ఎస్ఈ రవిప్రసాద్, ఈడబ్ల్యూఐడిసి ఈఈ, కొడంగల్ నారాయణపేట్ సంభందించిన ఇంజనీరింగ్ విభాగం ఈఈ, డీఈలు, సంభందిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి